RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా నిజం

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా నిజం
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:25 WEDNESDAY ,MAY 27,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :25 బుధవారం, మే 27, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నాం: మంత్రి సీతక్క



తెలంగాణ పత్రిక ప్రతినిధి

మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. - మిగతా2లో

## పంట అవశేషాలను కాల్చొద్దు: మంత్రి తుమ్మల

తెలంగాణ పత్రిక ప్రతినిధి

రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు.పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. - మిగతా2లో



## ప్రధాని మోదీతో కేరళ నూతన సీఎం సతీశన్ తొలి భేటీ

- రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సాయం కోరుతూ వినతిపత్రం
- ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇదే తొలి సమావేశం
- కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అమిత్ షాతోనూ భేటీకి ప్రణాళిక
- కేంద్రంతో సత్సంబంధాల దిశగా యూడీఎఫ్ సర్కార్ తొలి అడుగు



2

## ట్రంప్ 'ఇజ్రాయెల్' షరతుకు పాకిస్తాన్ నో!

### అబ్రహం అకార్డ్స్ పై వెనక్కి తగ్గేదే లేదన్న ఇస్లామాబాద్

తెలంగాణ పత్రిక ప్రతినిధి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొచ్చిన సరికొత్త దౌత్యపరమైన ఒత్తిడికి లొంగే ప్రసక్తే లేదని పాకిస్తాన్ తెగేసి చెప్పింది. ఇరాన్ దౌత్యపరమైన శాంతి ఒప్పందంలో భాగంగా.. పాకిస్తాన్ కూడా ఇజ్రాయెల్‌తో అధికారికంగా సంబంధాలను పునరుద్ధరించే 'అబ్రహం అకార్డ్స్' పై సంతకం చేయాలంటూ ట్రంప్ విధించిన షరతును పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పూర్తిగా తోసిపుచ్చారు. తమ దేశ మౌలిక - మిగతా2లో



## 45 ఏళ్ల తర్వాత పోలీసుల ఎదుట మావోయిస్ట్ నరహరి లొంగుబాటు..



తెలంగాణ పత్రిక ప్రతినిధి

మావోయిస్టు పార్టీలో సుదీర్ఘంగా నాలుగున్నర దశాబ్దాల (45 ఏళ్లు) పాటు పనిచేసిన పసునూరి నరహరి అలియాస్ సంతోష్, ఆయన భార్య - మిగతా2లో

## చుక్కలు చూద్దాం రండి... భువనగిరిలో 'నోవే గ్లాంప్'



2

## రాజాసింగ్‌కు సైబర్ కేటుగాడి ఫేక్ కాల్.. ప్రమాదం నుంచి తప్పించుకున్న రాజాసింగ్!



తెలంగాణ పత్రిక ప్రతినిధి

సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు చాలామందిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే - మిగతా2లో

## సింగరేణి పై కాంగ్రెస్ అక్రమాలు మరిన్ని బయటపెడతా: హరీష్ రావు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని - మిగతా2లో



## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ మోసం.. రియల్ ఎస్టేట్ కుదేలైంది

- తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్న రాంచందర్ రావు
- హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని మండిపాటు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి మజ్లిస్ పార్టీయే ముఖ్యమని వ్యాఖ్య



2

# మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నాం: మంత్రి సీతక్క

-మొదటిపేజీ తరువాయి

మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ప్రధాని మోదీతో కేరళ నూతన సీఎం సతీశన్ తొలి భేటీ

-మొదటిపేజీ తరువాయి

కేరళ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వి.డి. సతీశన్ నేడు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో తొలిసారి సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి ఘన విజయం సాధించిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు నెలకొల్పుకునే దిశగా ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని కార్యాలయంలో సుమారు 20 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరుతూ సీఎం సతీశన్.. ప్రధానికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సమావేశంలో కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. జయతిలక్ కూడా పాల్గొన్నారు. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్‌ను ఓడించి యూడీఎఫ్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఈ భేటీ జరగడం రాజకీయంగా ఆసక్తి రేపింది. మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక సహాయం, పెండింగ్‌లో ఉన్న రైల్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. అయితే, భేటీ అనంతరం బయటకు వచ్చిన సతీశన్.. చర్చల వివరాలను వెల్లడించలేదు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన ఆయన, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లతో కూడా సమావేశం కానున్నారు.

## 45 ఏళ్ల తర్వాత పోలీసుల ఎదుట మావోయిస్ట్ నరహరి లొంగుబాటు..

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కేసు వివరాలను వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక చర్యల వల్ల దేశంలో మావోయిస్టుల ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయిందని ఆయన స్పష్టం చేశారు. 2024 నుండి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 822 మంది మావోయిస్టులు 334 ఆయుధాలతో పోలీసుల ఎదుట లొంగిపోయారని డీజీపీ వివరించారు. లొంగిపోయిన వారికి రివార్డులను కూడా అందజేస్తున్నట్లు చెప్పారు. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' చేపట్టిందని.. ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాలలో భద్రతా దళాలు నిరంతరం జరిపిన కూంబింగ్ ఆపరేషన్ల వల్లే ఈ స్థాయిలో లొంగుబాట్లు, మార్పులు సాధ్యమయ్యాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంకా 47 మంది మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ తెలిపారు. ఇందులో ఛత్తీస్‌గఢ్ నుంచి 15 మంది, ఒడిశా నుంచి 15 మంది, ఝార్ఖండ్ నుంచి 13 మంది ఉండగా.. తెలంగాణకు చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒక్కరు ఉన్నట్లు గుర్తించామన్నారు. ముఖ్యంగా తెలంగాణకు చెందిన కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, జాడే రత్నబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగులు తక్షణమే లొంగిపోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున పూర్తి పునరావాస సదుపాయాలు, అన్ని రకాల బెనిఫిట్స్ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

## రాజాసింగ్‌కు సైబర్ కేటుగాడి ఫేక్ కాల్.. ప్రమాదం నుంచి తప్పించుకున్న రాజాసింగ్!

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుని ఒక గుర్తు తెలియని వ్యక్తి మోసానికి తెరలేపగా, అప్రమత్తమైన రాజాసింగ్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఫేక్ కాల్ ఉదంతంపై ఆయన స్వయంగా ఒక వీడియోను విడుదల చేసి వివరాలు వెల్లడించారు. రాజాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... నిన్న సాయంత్రం ఆయనకు ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ సెక్రటరీ దిలీప్ కుమార్‌ని అంటూ పరిచయం చేసుకున్నాడు. "ప్రధాన మంత్రి వికసిత్ భారత్" పథకం కింద తెలంగాణలో ప్రతి నియోజకవర్గానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని, దీని ద్వారా నియోజకవర్గ యువతకు 50 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల రుణాలు ఇస్తామని నమ్మబలికాడు. అన్నింటిలో ముందుండే మీరు ఈ స్కీమ్‌కు ఎందుకు అప్లై చేయలేదని ప్రశ్నిస్తూ.. రాత్రిలోపే ఆధార్ కార్డ్ వివరాలు పంపాలని ఒత్తిడి చేశాడు. ఈ గడువు విధింపుతో అనుమానం వచ్చిన రాజాసింగ్... వెంటనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీఏకు ఫోన్ చేసి క్రాస్ చెక్ చేసుకున్నారు. ఆర్థిక శాఖలో దిలీప్ కుమార్ అనే అధికారి ఎవరూ లేరని, అసలు అలాంటి స్కీమే లేదని తేలడంతో అది ఫేక్ కాల్ అని నిర్ధారించుకున్నారు. నియోజకవర్గ ప్రగతి కోసమని ఆశపడి ప్రజాప్రతినిధులు ఇలాంటి మోసాల బారిన పడే ప్రమాదం ఉందని, రెండు తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని రాజాసింగ్ హెచ్చరించారు.

# పంట అవశేషాలను కాల్చొద్దు: మంత్రి తుమ్మల

-మొదటిపేజీ తరువాయి

రైతులకు సబ్సిడీ పై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**యూరియా సరఫరా కేంద్రం పరిధిలోనే**

యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల ఆరోపించారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు.

**పంటల ఎంపికలో జాగ్రత్త**

రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# ట్రంప్ 'ఇజ్రాయెల్' షరతుకు పాకిస్తాన్ నో! అబ్రహం అకార్డ్స్ పై వెనక్కి తగ్గేదే లేదన్న ఇస్లామాబాద్

-మొదటిపేజీ తరువాయి

సిద్ధాంతాలు, విదేశాంగ విధానంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. ఇరాన్ వివాదానికి ముగింపు పలికేందుకు దౌత్యపరమైన చర్చలు తుది దశకు చేరుకున్న తరుణంలో డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఒక అనూహ్యమైన ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ఈ చర్చల్లో భాగస్వామ్య దేశాలుగా ఉన్న సౌదీ అరేబియా, ఖతార్, టర్కీలతో పాటు పాకిస్తాన్ కూడా 'అబ్రహం అకార్డ్స్' లో చేరడం తప్పనిసరి అని ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌ను గుర్తించి, ఆ దేశంతో దౌత్య సంబంధాలు పెట్టుకోవాలనేది ఈ ఒప్పంద ముఖ్య ఉద్దేశం.

**పాకిస్తాన్ ఎందుకు తిరస్కరించింది?**

ట్రంప్ ప్రతిపాదనపై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందిస్తూ.. 'మా ప్రాథమిక సిద్ధాంతాలతో విభేదించే ఎలాంటి ఒప్పందంలోనూ పాకిస్తాన్ చేరదు. రోజుకో మాట మార్చే (ఇజ్రాయెల్) వాళ్లతో కలిసి కూర్చోవడం మాకు సాధ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. కాగా, పాస్‌పోర్ట్ పాలసీ మేరకు పాకిస్తాన్ తన 78 ఏళ్ల చరిత్రలో ఇజ్రాయెల్‌ను ఎప్పుడూ గుర్తించలేదు. పాక్ పౌరులు ఇజ్రాయెల్ వెళ్లకుండా పాస్‌పోర్ట్‌పై ప్రత్యేకంగా నిబంధన కూడా ఉంది. ఈ నేపథ్యంలో 1967 పూర్వపు సరిహద్దుల ప్రకారం స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పడేంతవరకూ ఇజ్రాయెల్‌ను గుర్తించే ప్రసక్తే లేదని పాక్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

**పాకిస్తాన్‌కు సరికొత్త తలనొప్పి**

ఈ వివాదం ఇప్పుడు పాకిస్తాన్‌ను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. ఒకవైపు అమెరికా-ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించే బాధ్యతను ట్రంప్ స్వయంగా పాకిస్తాన్‌కు అప్పగించారు. ఇప్పుడు ట్రంప్ మాటను కాదంటే ఆయన ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. మరోవైపు, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్తాన్‌కు నిధులు ఇచ్చే సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలు కూడా అమెరికా ఒత్తిడితో ఇజ్రాయెల్ వైపు అడుగులు వేస్తున్నాయి. ఇలాంటి స్థితిలో ఇటు అమెరికాను తట్టుకుంటూ, అటు దేశీయంగా ఉన్న మతపరమైన సంస్థల నుంచి వ్యతిరేకత రాకుండా చూసుకోవడం పాకిస్తాన్‌కు కత్తిమీద సాములా మారింది.

**అబ్రహం అకార్డ్స్ అంటే ఏంటి?**

డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీ కాలంలో (2020లో) ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య దౌత్య, ఆర్థిక సంబంధాలను నెలకొల్పేందుకు కుదిర్చిన చారిత్రాత్మక ఒప్పందాలే ఈ 'అబ్రహం అకార్డ్స్'. ఇందులో ఇప్పటికే యూఏఈ , బహ్రెయిన్, మొరాకో, సూడాన్, కజకిస్తాన్ వంటి దేశాలు చేరాయి.

# చుక్కలు చూద్దాం రండి... భువనగిరిలో 'నోవే గ్లాంప్'

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ నగర జీవితంలోని హడావిడికి దూరంగా, ప్రకృతి ఒడిలో నక్షత్రాలను వీక్షిస్తూ సేదతీరాలనుకునే వారి కోసం ఓ సరికొత్త గమ్యస్థానం అందుబాటులోకి వచ్చింది. నగరానికి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో, యాదాద్రి భువనగిరి జిల్లాలో 'నోవే గ్లాంప్' పేరుతో ఒక లగ్జరీ గ్యాంపింగ్, స్టార్‌గేజింగ్ రిట్రీట్‌ను ప్రారంభించారు. 2025 డిసెంబర్‌లో మొదలైన ఈ రిట్రీట్, 100 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి అందాల మధ్య ఏర్పాటు చేయబడింది. హైదరాబాద్‌తో పోలిస్తే ఇక్కడ కాంతి కాలుష్యం చాలా తక్కువగా ఉండటం (హైదరాబాద్‌లో బోర్టిల్ స్కేల్ 8 కాగా, ఇక్కడ 3-4 మాత్రమే) ఈ ప్రదేశం యొక్క ముఖ్య ఆకర్షణ. దీనివల్ల ఆకాశం స్పష్టంగా కనిపించి, నక్షత్రాలను, గ్రహాలను వీక్షించడానికి అనువుగా ఉంటుంది. ముఖ్యంగా శీతాకాలంలో ఈ అనుభూతి మరింత అద్భుతంగా ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ రిట్రీట్‌ను లడఖ్‌లో స్టార్‌గేజింగ్ అనుభవం నుంచి స్ఫూర్తి పొంది సందీప్ రెడ్డి మోకు స్థాపించారు. ఇక్కడికి వచ్చే వారికి ఖగోళ శాస్త్ర గైడ్ భాను ప్రకాశ్ వంటి నిపుణులు నక్షత్రాలు, గ్రహాలు, వాటి జీవిత చక్రాల గురించి వివరిస్తారు. టెలిస్కోప్ ద్వారా బృహస్పతి, దాని చంద్రులను, ధ్రువ నక్షత్రాన్ని, అరుంధతి-వశిష్ఠ వంటి జంట నక్షత్రాలను దగ్గరగా చూసే అవకాశం కల్పిస్తున్నారు. ఉదయం పూట సోలార్ ఫిల్టర్ల సహాయంతో సూర్యుడిని కూడా పరిశీలించవచ్చు. ఇక్కడ బడ్జెట్ డోర్మ్‌ల నుంచి అమెరికన్ డోమ్ టెంట్లు, లగ్జరీ కోన్ టెంట్లు, సూట్ల వరకు వివిధ రకాల వసతులు అందుబాటులో ఉన్నాయి. ధరలు ఒక్కో వ్యక్తికి సుమారు రూ.2,800 నుంచి ప్రారంభమై, ప్రీమియం వసతులకు రూ.14,999 వరకు ఉంటాయి. స్టార్‌గేజింగ్‌తో పాటు బాక్స్ క్రికెట్, మట్టితో దీపాలు తయారుచేయడం, పెయింటింగ్, మామిడి, చింత చెట్ల మధ్య నేచర్ వాక్ వంటి కార్యకలాపాలు కూడా ఉన్నాయి. ప్రతి వారాంతంలో వాతావరణం అనుకూలించినప్పుడు ఈ సెషన్లు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలు, బుకింగ్స్ కోసం 88868 66631 నంబర్‌లో సంప్రదించవచ్చు.

# సింగరేణి పై కాంగ్రెస్ అక్రమాలు మరిన్ని బయటపెడతా: హరీష్ రావు

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో - సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాంగ్రెస్ మోసం.. రియల్ ఎస్టేట్ కుదేలైంది

-మొదటిపేజీ తరువాయి

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే బాటలో నడుస్తూ పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఎంఐఎం ఒత్తిడికి లొంగి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని దుయ్యబట్టారు. నగరంలో డివిజన్ల ఏర్పాటు పై అధికారులకే క్లారిటీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మజ్లిస్ పార్టీయే ముఖ్యమని, నగర ప్రజలు కాదని విమర్శించారు. భాగ్యనగరంలో తాగునీటి ఎద్దడి, కాలుష్య నియంత్రణ పై ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, చిన్న వాన పడితేనే నగరం మునిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ పాలనలో నేతలు రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకోగా, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఆ రంగం పూర్తిగా కుదేలైందని రామచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్‌ను నిజమైన విశ్వనగరంగా మార్చడం, అవినీతి రహిత పాలన అందించడం ఒక్క బీజేపీకే సాధ్యమని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పి, బీజేపీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్ లో స్థలం కేటాయింపు





**-జగిత్యాలను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడం లక్ష్యం..**
**-రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల మే 26 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి

జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్ శివారులోని సర్వే నెంబర్ 437లో స్థలం కేటాయించినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో పాటు కలిసి నర్సింగాపూర్ లోని కేంద్రీయ విద్యాలయానికి కేటాయించే తలపెట్టిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి ఇన్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేసి ముందుకు సాగుతున్నారని మంత్రి తెలిపారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని నర్సింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం 6 ఎకరాల స్థలాన్ని సర్వే నెంబర్ 437లో కేటాయిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఇప్పటికే రూ. 33 కోట్లతో ఐటిఐ, ఈ ఏటీసీ సెంటర్ ను ఇక్కడ ఏర్పాటు చేశామని వృద్ధ ఆశ్రమం సైతం ఇక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్ గా మారుతుందని మంత్రి తెలిపారు. చల్ గల్ లోని వ్యవసాయ పరిశోధనకు సంబంధించిన వాలంతరీ భూములను 12 ఎకరాలు కేంద్రీయ విద్యాలయానికి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కి కేటాయించడం జరిగిందని మంత్రి వివరించారు. కేంద్రీయ విద్యాలయానికి రెండు ఎకరాల స్థలం సరిపోదని వివాదం నేపథ్యంలో నర్సింగాపూర్ లో ప్రభుత్వ భూమి కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం చల్ గల్ మరిన్ని వ్యవసాయ పరిశోధనలు జరగాల్సిన నేపథ్యంలో వ్యవసాయ పరిశోధనల భవిష్యత్తు అవసరాల కోసం అక్కడి భూములను అంతకు మించి కేటాయించే అవకాశం లేదని మంత్రి తెలిపారు. నర్సింగాపూర్ భూముల ప్రతిపాదనలు జిల్లా అధికారులద్వారా కేంద్రీయ విద్యాలయ అధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని ఎందుకు నిజామాబాద్ ఎంపీ అరవింద్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సహకరించాలని మంత్రి కోరారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్లపై ఆగ్రహం

**-భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం ఆసుపత్రులపై విచారణ చేయాలి**
**-జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోకు డా. మారెల్లి విజయకుమార్ వినతిపత్రం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మే 26:(తెలంగాణ పత్రిక)

భద్రాచలం, మణుగూరు మరియు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి వినతిపత్రం సమర్పించినట్లు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేట్ జిల్లా అధ్యక్షుడు డా. మారెల్లి విజయకుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర సమయాల్లో డాక్టర్లు అందుబాటులో లేక రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, కొంతమంది నర్సులు మరియు సిబ్బంది రోగులతో అమానుషంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కొంతమంది కాంట్రాక్ట్ కార్మికులు ప్రతి చిన్న పనికీ డబ్బులు డిమాండ్ చేస్తూ పేద రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మణుగూరు ఏరియా హాస్పిటల్ లో "మామూల్" ఇవ్వకపోతే యూరిన్ పైపు కూడా పెట్టరని, ఆపరేషన్ థియేటర్ వరకు తీసుకెళ్లేందుకు డబ్బులు అడుగుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లలో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఆసుపత్రులలో పరిశుభ్రత దయనీయంగా మారిందని, వార్డులు, మరుగుదొడ్లు శుభ్రంగా లేక రోగులకు ఇన్ఫెక్షన్ల ముప్పు పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందించే ఆహారం నాణ్యతలేనిదిగా ఉందని, అవసరమైన మందులు అందుబాటులో లేక పేద రోగులు బయట మెడికల్ షాపులపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. మణుగూరు ఏరియా హాస్పిటల్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాప్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి భౌతిక కాయాలను తరలించేందుకు సరైన అంబులెన్స్ సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.




ఈ నేపథ్యంలో భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, అక్రమ వసూళ్లపై విజిలెన్స్ విచారణ జరపాలని, రోగులతో దురుసుగా ప్రవర్తించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డా. మారెల్లి విజయకుమార్ డిమాండ్ చేశారు. అలాగే ఆసుపత్రుల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, మందుల లభ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి పేద ప్రజలకు గౌరవప్రదమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పిల్లలకు ఈతలకు వెళ్లకుండ జాగ్రత్తలు తీసుకోవాలి





**- చారకొండ ఎస్సై వీరబాబు**

తెలంగాణ పత్రిక చారకొండ:

నాగర్కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో మంగళవారం మండల పరిధిలోని నూకల చింతవాడిక తండ సమీపంలో డీఎల్ఐ కాలువలో పిల్లలు ఈతలు కొడుతున్న సమాచారం తెలుసుకున్న ఎస్సై వీరబాబు పోలీస్ సిబ్బందితో కలిసి డిఎల్ఐ కాలును సందర్శించారు. పిల్లలు ఈతలకు వెళ్లకుండా తమ తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి చారకొండ ఎస్సై వీరబాబు అన్నారు. పిల్లల పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై వీరబాబు మాట్లాడుతూ డిఎల్ఐ కాలువలో రాళ్ళు, రపలు, లోయాలు ఉంటాయని తమ పిల్లలు ఈతలకు వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. తమ పిల్లలకు ఈత నేర్పించాలని అనుకుంటే తల్లిదండ్రులు దగ్గర ఉండి జాగ్రత్తలు తీసుకుని నేర్పించాలని చెప్పారు. తమ పిల్లలపై అలసత్వం వహించకుండా జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అన్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన సర్పంచ్ -చిలికేశ్వరం శంకర్

మే 26 తెలంగాణ పత్రిక చారకొండ

నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలం చంద్రాయన్ పల్లి గ్రామంలో సర్పంచ్ చిలికేశ్వర శంకర్ ఉపాధి కూలీ పనులను పరిశీలించారు. ఉపాధి కూలీ సమస్యలను అడిగి తెలుసుకుని చేసిన పనికి తగిన వేతనం అకౌంట్లో జమ అవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో ఉపాధి కూలీలకు బట్టర్ మిల్క్ (మజ్జిగ) ను అందజేశారు. ఉప సర్పంచ్ దేరంగుల వెంకటయ్య, వార్డ్ మెంబర్స్ జమ్మల బాలచంద్రి, ఫీల్డ్ అసిస్టెంట్ గడ్డమీద శ్రీను, కాంగ్రెస్ నాయకులు పాల్గొని వీరయ్య గౌడ్ పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను పరామర్శించిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు



మంగపేట,మే 26 (తెలంగాణ పత్రిక)

మంగపేట మండలం కమలాపురంలో బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పర్యటించారు. గ్రామంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. కమలాపురం బిఆర్ఎస్ పార్టీ మాజీ కోశాధికారి పగడాల వెంకట్ రెడ్డి మాతృమూర్తి పగడాల లక్ష్మమ్మ మృతి చెందగా, వారి అంతిమయాత్రలో లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు. లక్ష్మమ్మ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే, బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి వీరగోని బాలకృష్ణ తల్లి సుగుణమ్మ ఇటీవల మరణించగా, బాలకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి సుగుణమ్మ ఆత్మ శాంతి కలగాలని కోరుకున్నారు. ఇదే క్రమంలో, ఇటీవల వడదెబ్బ తగిలి మృతి చెందిన వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎండలు విపరీతంగా ఉన్నందున ప్రతి ఒక్కరు అవసరమైతేనే ఇళ్ల నుండి బయటకు రావాలని, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగుతూ తగు జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాటి కృష్ణ, తుమ్మ మల్లారెడ్డి, ఎండి వలీ బాబా, పప్పు వెంకట్ రెడ్డి, ఎస్కె కుర్బాన్ అలీ, చిట్టి మల్ల సమ్మయ్య, చల్లగురుగుల తిరుపతి, తాడూరి రఘు, చీకుర్తి సుధాకర్, యాదండ్ల రాజయ్య, పబ్బోజు సత్యనారాయణ, గుడిసేవ నాగేశ్వరావు, యలవర్తి శ్రీనివాసరావు, గోమాస చందర్ రావు, పరికి శ్రీను, యాస నాగేందర్, పంజాల సత్యం, దోమల నర్సయ్య, ఇట్టబోయిన సాంబయ్య, తుక్కాని ఉమేష్, భద్రయ్య, బీస్ సాంబయ్య తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## ఎస్సీ కమ్యూనిటీ హాల్ మీదుగా కాలువ పనులు ఆపాలి

**-గుగ్గిళ్ల సురేష్**


మంగపేట,మే26 (తెలంగాణ పత్రిక)



మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ కోసం ఎస్సీ కమ్యూనిటీ హాల్ స్థలం మీదుగా చేపడుతున్న సైడ్ డ్రైనేజీ పనులను తక్షణమే నిలిపివేయాలని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు గుగ్గిళ్ల సురేష్ డిమాండ్ చేశారు. మంగపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వం దళితుల సమావేశాల కోసం 4 గుంటల స్థలాన్ని కేటాయించిందని, అందులో రూ. 25 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించారని తెలిపారు. అయితే, ఈ భవనానికి సంబంధించిన నిధులు పూర్తిగా విడుదల కాకపోవడంతో తలుపులు, కిటికీలు, పెయింటింగ్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, ప్రస్తుత ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. ఇలాంటి పరిస్థితుల్లో పంచాయతీరాజ్ సహాయ ఇంజనీర్ ఎలాంటి సమాచారం లేకుండా కమ్యూనిటీ హాల్ మీదుగా డ్రైనేజీ నిర్మించడం వల్ల భవిష్యత్తులో వరదలకు భవనం కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ డ్రైనేజీని రైతు సొసైటీ మరియు అంబేద్కర్ విగ్రహం ముందు నుండి వెళ్లేలా మార్చాలని కోరారు. పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ పనులను ఆపాలని గుగ్గిళ్ల సురేష్ డిమాండ్ చేశారు.

## హాస్టల్ మెస్ బిల్లుల చెల్లింపులకు గడువు పొడిగింపు

భద్రాద్రి కొత్తగూడెం, మే 26:(తెలంగాణ పత్రిక)




2025-26 సంవత్సరానికి గాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థుల హాస్టల్ మెస్ బిల్లుల రీయింబర్స్‌మెంట్ దరఖాస్తుల గడువును ప్రభుత్వం పొడిగించింది. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల కింద విద్యార్థులు నూతన మరియు రెన్యువల్ దరఖాస్తులను సమర్పించేందుకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. అర్హులైన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ అయిన telanganaepass.cgg.gov.in లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ అప్లికేషన్ స్థితిని పరిశీలించుకోవాలని, ఇంకా దరఖాస్తు చేయని వారు గడువు ముగిసేలోపు వెంటనే నమోదు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## తాటి చెట్టు పై నుండి పడి మరణించిన ఉయ్యాల జానయ్య కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి




తెలంగాణ పత్రిక, సూర్యాపేట, మే 26


సూర్యాపేట కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎలుగురి గోవిందు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట రూరల్ కేటీ అన్నారం గ్రామంలో ఉయ్యాల జానయ్య వయస్సు 38 అనే గీత కార్మికుడు 25/5/2026 సాయంత్రం ఐదు గంటలకు రోజువారీగా తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మరణించినాడు. అది తెలుసుకున్న కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్గూరి గోవిందు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ప్రభుత్వం వెంటనే అతని కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. జానయ్య కుటుంబం పేద కుటుంబాలని వారికి చిన్న చిన్న పిల్లలు ఉన్నారని ఇంటి పెద్దాయన కోల్పోయి దిక్కు లేని స్థితిలో ఉన్నారని ప్రభుత్వం వెంటనే వారికి ఎక్స్గ్రేషియా అందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వారి వెంట తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుణగంటి కృష్ణ గ్రామ సొసైటీ అధ్యక్షులు బత్తిని సైదులు గౌడ్ జలగం నరసయ్య జిల్లా కమిటీ సభ్యులు అబ్బ గాని కాశయ్య పల్సా జానయ్య చౌగాని జానయ్య చోగానీ సైదులు చౌగాని లింగయ్య చౌగాని ఎల్లయ్య మరియు వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

## సార్గమ్మ సంధి రోడ్డు వర్కు గురించి కలెక్టర్ కు వినతి

-వినతి పత్రం అందజేసిన మాజీ కౌన్సిలర్ హనుమాండ్ల జయశ్రీ

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 26





జగిత్యాల పట్టణ నడిబొడ్డున గల సారగమ్మ సందిలో రోడ్డు,డ్రైన్, డ్రైన్ పైకప్పు కొరకు టియుఎఫ్ఐడిసి ద్వారా నిదులు రోడ్డుకు 19 లక్షలు, డ్రైన్,డ్రైన్ పై కప్పు కొరకు 11లక్షలు కేటాయించి టెండర్ పిలవడం జరిగింది. మున్సిపల్ ఎలక్షన్ ముందే డ్రైన్ కట్టి రోడ్డు వేస్తామని,ఆ రోడ్డులో గత 50 సంవత్సరాల క్రితం వేసిన నల్లా పైపులు ఉన్నాయి,నల్లా నీరు రావటం లేదు అని,పైపు లైన్ వేసిన తర్వాతనే డ్రైన్ నిర్మాణం చేయాలని అప్పుడు ఆపగా, అమృత్ స్కీంలో పైపులు వేస్తామని చెప్పిన కాంట్రాక్టర్ తిరిగి ఎలక్షన్ పూర్తయిన 15రోజులలో పైపు లైను వేయకుండానే డ్రైన్ వర్క్ స్టార్ట్ చేసాడు.మున్సిపల్ అధికారులు,వర్క్ ఇన్స్పెక్టర్ మార్కింగ్ చేసిన పద్ధతిలో కాకుండా పాత డ్రైన్ తవ్వి యదావిధిగా డ్రైన్ కట్టారు.ఏఈ, డిఈ అందుబాటులో లేని రోజులలో అధికారుల అద్వర్యంలో పని చేయాల్సిన కాంట్రాక్టర్ తన ఇష్టారీతిగా డ్రైన్ కట్టడం,ఒక కొత్త బిల్డింగ్ యజమాని ఇంటి ముందు ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా ఇంకా రోడ్డు వైపే జరిపి డ్రైన్ నిర్మాణం చేయడం పాత ఇండ్ల ముందున్న గద్దెలను తొలగించ కుండ యదావిధిగా డ్రైన్ కట్టడంతో సంది ఇంకా ఇరుకుగా మారడంతో అక్కడున్న ప్రజలు వెనుకకు జరిపి కట్టాలని స్వచ్ఛందంగా వచ్చి తెలియ చేసిన కాంట్రాక్టర్ ఏమి పట్టించుకోకుండా నిర్మాణం చేయడంతో డిఈ కి విషయం తెలియ చేయగా స్వయంగా వచ్చి చూసి 70%. డ్రైన్ సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణం చేశారని,కేవలం 30% డ్రైన్ మాత్రమే కరెక్టుగా ఉంది అని తెలియ చెస్తూ ఈఈ ని తీసుకొని వచ్చి చూపిస్తాను అని చెప్పి తీసుకు వచ్చి చూపించగా ఎటువంటి మాట మాట్లాడకుండా, వెళ్ళారు. కావున పైన తెలిపిన విషయాలను దృష్టిలో ఉంచుకొని వార్డు ప్రజల తరఫున అధికారుల దృష్టికి తీసుకు రాగా,అందరూ రోడ్డు వెడల్పు కావాలని కోరుకున్న దృష్ట్యా కిరాయిలు కూడ పెరగడానికి ఆస్కారం ఉండడంతో,అక్కడ నివసిస్తున్న ప్రజలు గత 3నెలలు గా రాకపోకలకు చాల ఇబ్బంది పడుతున్న దృష్ట్యా వెంటనే పనులు పూర్తి చేయాలని వార్డు ప్రజల తరఫున విజ్ఞప్తి చేశారు.

## దామేళ్ల రత్నాకర్ కుటుంబాన్ని పరామర్శించిన అంబేద్కర్ సంఘం నాయకులు

మంగపేట,మే,26(తెలంగాణ పత్రిక)



అంబేద్కర్ సంఘం సీనియర్ రాష్ట్ర నాయకులు దామేళ్ల రత్నాకర్ తల్లి గారు ఇటీవల మరణించారు. ఈరోజు ఆమె ఐదవ రోజు సందర్భంగా కమలాపురంలోని రత్నాకర్ నివాసానికి వెళ్లిన తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అక్కడ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, యెంపెల్లి సమ్మయ్య, పల్లె శోభన్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల నరేష్, డివిజన్ అధ్యక్షులు బసరికాని హరికృష్ణ, మంగపేట మండల అధ్యక్షులు యెంపెల్లి వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి బోడ రామచంద్రం, కమలాపురం గ్రామ అధ్యక్షులు దాసరి బుజ్జి, నాయకులు బసరికాని నాగార్జున, గోమాసు లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లు కష్టపడదాం పదేళ్లు అధికారంలో ఉందాం

-టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 26



ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ బీజేపీ తోడు దొంగల పార్టీ. రైతుల సమస్యలను పక్కదోవ పట్టాలని కాంగ్రెస్ పార్టీ పెట్రోల్ డీజిల్ అంటూ ధర్నాలు చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ పైన వ్యాట్ 10% తగ్గించాలి.రాష్ట్రంలో ఆటో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది.బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కెసిఆర్ సూచనలకు అనుగుణంగా సభ్యత్వ నమోదు చేపడుతున్నాం. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి దశాబ్ద కాలంగా మాజీ శాసన సభ్యులు విద్యాసాగర్ రావు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్పర్సన్ దావా వసంత సురేష్ కృషి చేశారు. జగిత్యాలలో స్వార్ధ ప్రయోజన రాజకీయాలతో పార్టీ వీడే పరిస్థితి వస్తుందని ఊహించలేదు.కాంగ్రెస్ పార్టీలో వివక్షకు గురి కావడంతో, తెలంగాణ రాష్ట్ర పునర్ వైభవం కేసీఆర్ తోనే సాధ్యమని బీఆర్ఎస్ లో చేరానని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ లో అవకాశం ఇచిన కెసిఆర్ కు రుణ పడి ఉంటా అని అన్నారు. దశాబ్ద కాలం కేసీఆర్ రైతుబంధు, కళ్యాణ లక్ష్మి, నీటి వనరుల సౌకర్యం కల్పించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారు. పంచాయతీ సమితి అధ్యక్షుడిగా ప్రతిపక్ష పార్టీ లో ఉండి పోరాటం చేస్తున్నాను.రెండు పడవల పై ప్రయాణం చేసే వారు తాత్కాలిక లాభం పొందినా, వారి భవిషత్ ఎటు కాకుండా పోతారు. విద్యార్థులు,యువత, మహిళలు అసంతృప్తి తో ఉన్నారు..పెట్రోల్, డీజిల్ మీద దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ లో వ్యాట్ పన్నులు విధిస్తున్నారు.పెట్రోల్, డీజిల్ పెంపు పై పోరాటం చేయడంతోపాటు ప్రజల పై భారం తగ్గించేందుకు వ్యాట్ పది శాతం తగ్గించుకోవాలి. ఆటో కార్మికులకు నెలకు వెయ్యి ఇస్తామని చెప్పి మరిచారు.క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ లో జరుగుతున్న అన్యాయం పై వివరిస్తూ, సభ్యత్వ నమోదు చేయాలి.రెండేళ్లు కష్టపడుధాం పదేళ్లు అధికారం లో ఉందామని ఉత్తేజ పరిచారు.క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ ఎస్ జెండా ఎగుర వేస్తామన్నారు.

-మాజీ శాసన సభ్యులు విద్యా సాగర్ రావు మాట్లాడుతూ

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఆన్లైన్ పద్ధతిలో నిర్వహించనున్నారు.తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఉద్యమం వివరిస్తూ యువతకు బీ ఆర్ఎస్ లో అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజల ఇబ్బందులు తెలియజేస్తూ, చైతన్యం కల్పించాలి.గ్రామాల్లో ప్రశ్నించే వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తూ భయ బ్రాంతులకు గురి చేస్తున్నారు.బీఆర్ఎస్ పాలనలో ధాన్యం కొనుగోలు లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదులో జగిత్యాలకు మొదటి స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. అధికార పక్షాన్ని వీడి ప్రజల పక్షాన నిలబడేందుకుజీవన్ రెడ్డి పార్టీలోకి రావడంతో పార్టీకి మరింత బలం చేకూరింది.కేసీఆర్ అభిమానులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సభ్యత్వ నమోదు చేపట్టాలి.రెండేళ్ల తర్వాత కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని, క్రమశిక్షణతో, పార్టీ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలని అన్నారు.రైతులకు అండగా నిలుస్తూ, రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తోంది.పనిచేసే కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు లభిస్తుంది అని భరోసా ఇచ్చారు.సమన్వయంతో అందరూ కలిసి గతంలో చేసిన సభ్యత్వం కన్నా అధికముగా చేయాలని అన్నారు.కాంగ్రెస్ ను గద్దె దించేందుకు కలిసికట్టుగా పనిచేస్తూ, కెసిఆర్ ను మళ్ళీ ముఖ్యమంత్రి గా చేసేందుకు అందరూ కష్టపడి పని చేయాలి.ప్రతి కార్యకర్తకు జీవిత బీమా సౌకర్యం కల్పించే దిశగా ఆలోచించాలని పలువురు అభిప్రాయ పడ్డారు. కష్టపడుదాం జగిత్యాల జిల్లాను మొదటి స్థానంలో నిలుపుదాం అని నినదించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటి పర్తి జీవన్ రెడ్డి, మాజీ శాసన సభ్యులు జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు. విద్యాసాగర్ రావు, సమన్వయ కర్త, జిల్లా పరిషత్ తొలి మాజీ ఛైర్పర్సన్ దావ వసంత సురేష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ శీలం ప్రియాంక ప్రవీణ్, మున్సిపల్ చైర్మన్ కటకం రవీందర్, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, వైస్ ఛైర్పర్సన్ మున్నా,ఆయిల్నెని వెంకటేశ్వర రావు, కౌన్సిలర్స్ , సర్పంచులు వివిధ గ్రామాల సమన్వయ కర్తలు,సమావేశంలో పాల్గొనీ మాట్లాడారు.

# నంగారాభేరి' తప్పదు లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్





ఆమనగల్లు తెలంగాణ పత్రిక మే 26

కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుంటుందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ తీవ్రస్థాయిలో ఖండించారు. లంబాడీల హక్కుల సాధనకై హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వేదికగా నిర్వహించి తలపెట్టిన "గిరిజన మహా ధర్నా"కు కల్వకుర్తి నియోజకవర్గం నుండి గిరిజన నాయకులు భారీ ఎత్తున వెళ్లారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో బయలుదేరిన లంబాడీలు, అంతకుముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా వైపు కదంతొక్కారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం లో ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన 30 నెలలు గడుస్తున్నా.. ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన "చెవెళ్ల డిక్లరేషన్" హామీలను అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. లంబాడి వర్గానికి రాష్ట్ర క్యాబినెట్‌లో తక్షణమే తగిన చోటు కల్పించాలని, అలాగే గిరిజన తండాలను పూర్తిస్థాయి రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ప్రకటించాలని వారు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తూ డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నాతోనైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో తండ తండాలు ఏకం చేసి, ప్రతి జిల్లా కేంద్రంలో "నంగారాభేరి" మోగిస్తామని మా హక్కులను సాధనకై పాలకులను హెచ్చరించారు. కార్యక్రమంలో రామ్ నుంతుల సర్పంచ్ శ్రీను నాయక్ రామ్ చందర్ నాయక్ శ్రీను నాయక్ ప్రియా రమేష్ మాజీ ఎంపీపీ సువాలి పంతు నాయక్ మాజీ సర్పంచ్ పూజా దేవా నాయక్ మాజీ ఎంపిటిసి సాయిలు నాయకులు శ్రీను నాయక్ చందు నాయక్ జైపాల్ నాయక్ కోటియా నాయక్ ప్రవీణ్ నాయక్ సోమ్లా కిషన్ నాయక్ నాయక్ దేవా నాయక్ సరియానాయక్ గోపాల్ నాయక్ శీను నాయక్ పత్తి నాయక్ భాస్కర్ నాయక్ శీను నాయక్ జగన్ నాయక్ రమేష్ నాయక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అధికారులు యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

-పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బిఎస్ లత.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) మే 26



మంగళవారం జగిత్యాల కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పై జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత, జిల్లా పౌరసరఫరాల అధికారులతో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,వయోవృద్ధుల వికలాంగుల,ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ సీజన్ వరి ధాన్యం అధిక దిగుబడి వచ్చిందని 10 నుండి 15% వరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బ్యాలెన్స్ ఉందని 10 రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేసి మిల్లులకు వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరలించిన ధాన్యం మిల్లుల్లో కూడా సత్వరమే అన్లోడింగ్ జరగాలని స్పష్టం చేశారు.జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఇప్పటివరకు దాదాపు 80% వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయినందున ఇందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు, మిల్లర్లకు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు అభినందనలు తెలిపారు. జిల్లాలోని 441 కొనుగోలు కేంద్రాల్లో ఈరోజు వరకు 4.59 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం వచ్చిందని,3.29 లక్షల మెట్రిక్ టన్నుల ప్యాడి కొనుగోలు చేశామని అన్నారు.వరి ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలో జగిత్యాల జిల్లా 4వ స్థానంలో ఉన్నదని అన్నారు. జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు సన్నద్ధం కావాలని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన ధాన్యానికి సరిపడే గోదాములు అందుబాటులో ఉన్నాయని అంచనాలకు మించి ధాన్యం వస్తే జిల్లాలోని ముత్యం పేట షుగర్ ఫ్యాక్టరీ, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని, పెద్ద పెద్ద పెల్లి లోని గోదాములకు తరలించాలని అన్నారు.జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో దాదాపు 80% వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని అన్నారు. మిగతా వరి ధాన్యం త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు.వరి ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలో జగిత్యాల జిల్లా 4వ స్థానంలో ఉన్నదని అన్నారు.జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు సన్నద్ధం చేశామని అన్నారు.జిల్లాలో చెక్ పోస్టు ఏర్పాటు చేసి దాదాపు రోజుకు 30 నుండి 35 వరకు వాహనాలను కొనుగోలు కేంద్రాలకు తరలించి ధాన్యం మిల్లులకు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆరు గంటలకు ఒకసారి రిపోర్టులు తీసుకొని పర్యవేక్షిస్తునట్లు తెలిపారు. అదేవిధంగా 233 డీసీఎం, 862 లారీలు,297 ట్రాక్టర్ లను ధాన్యం తరలించుటకు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి. ఎస్ లత, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, పౌరసరఫరాల డిఎం జితేంద్ర ప్రసాద్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడు వట్టం ఉపేందర్‌కు ఘన సన్మానం





-స్వగ్రామం గోపాలపురంలో మిన్నంటిన సంబరాలు
-సాధారణ కార్యకర్త నుండి జాతీయ స్థాయికి ఎదగడం గర్వకారణం: గ్రామస్తులు

కొత్తగూడ మండల ప్రతినిధి:- మే 26. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, తుడుందెబ్బ జాతీయ అధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన, వట్టం ఉపేందర్ కు ఆయన స్వగ్రామంలో గ్రామస్తులు, గిరిజన నాయకులు ఘన స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం గోపాలపురం గ్రామానికి ఆయన తొలిసారిగా విచ్చేసిన సందర్భంగా, మంగళవారం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యకర్త స్థాయి నుండి దేశస్థాయికి ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు మాట్లాడుతూ.. తమ గ్రామం లో పుట్టి పెరిగిన వట్టం ఉపేందర్, ఇక్కడి చైతన్య యువజన సంఘంలో చురుగ్గా పనిచేస్తూ సామాజిక సేవా రంగంలోకి అడుగుపెట్టారని గుర్తు చేసుకున్నారు. తుడుందెబ్బ సంఘంలో ఒక సాధారణ కార్యకర్తగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి.. తన నిబద్ధత, నాయకత్వ పటిమతో మండల అధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షుడిగా, ఆ తర్వాత రాష్ట్ర అధ్యక్షుడిగా అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. వట్టం ఉపేందర్ ఆధ్వర్యంలో తుడుందెబ్బ సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఎంతో బలోపేతమైందని, ఆదివాసీల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు సాగించారని అన్నారు. నేడు ఆయన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గోపాలపురం గ్రామ కీర్తి ప్రతిష్టలను దేశస్థాయికి తీసుకెళ్లిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఆత్మీయ సత్కారం: స్వగ్రామానికి చేరుకున్న వట్టం ఉపేందర్‌కు గ్రామస్తులు మంగళహారతులు, సాంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఆయనను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివాసీ హక్కుల పోరాటం లో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ దొర పటేళ్లు వాసం భద్రయ్య, పూనేం రామస్వామి, తురస భద్రయ్యలతో పాటు స్థానిక సర్పంచ్ వట్టం శ్రీను బాబు, పూనెం లక్ష్మి నర్సు, తుడుం దెబ్బ కొత్తగూడ మండల అధ్యక్షుడు పూణేం సందీప్, గ్రామ పెద్దలు, చైతన్య యువజన సంఘం సభ్యులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాక్టర్ టైర్ల కింద పడి డ్రైవర్ మృతి

-మహిళా కూలి సాహసంతో తప్పిన ఘోరప్రమాదం

నంగునూరు, మే 26(తెలంగాణ పత్రిక):

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకులలో ఉపాధి హామీ పథకం పనులలో రహదారి కోసం కూలీలతో ట్రాక్టర్ లో మట్టిని తరలిస్తుండగా ట్రాక్టరు నడుపుతున్న ఉపాధి హామీ కూలీ, డ్రైవర్ రేపాక మహిపాల్ రెడ్డి(43) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మట్టి నింపేందుకు నిలిపి ఉంచే క్రమంలో ట్రాక్టర్ పల్లం వైపు జారుతుండడంతో చక్రాల కింద రాయి పెట్టేందుకు మహిపాల్ రెడ్డి ప్రయత్నించాడు ఈ క్రమంలో మహిపాల్ రెడ్డి జారి పడ్డాడు. దీంతో ట్రాక్టర్ చక్రాలు మహిపాల్ రెడ్డి మీదుగా పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన సమయంలో ట్రాలిలో కూలీలు ఉన్నప్పటికీ వారికి ఎలాంటి గాయాలు కాలేదు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామాల్లో విషాదం నెలకొంది





-మహిళా కూలి సాహసం...తప్పిన ఘోరప్రమాదం

పాలమాకులలో ఉపాధి హామీ పనుల్లో ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి చెందిన ఘటనలో ఉపాధి హామీ మహిళా కూలి భారతమ్మ చేసిన సాహసం ఎనిమిది మంది తోటి కూలీల ప్రాణాలు కాపాడింది. ప్రమాదం అనంతరం ముందుకు ట్రాక్టర్ వెళుతుండడంతో భారతమ్మ పరుగెత్తి వెళ్లి బ్రేకులు గట్టిగా పట్టుకుని ఆపింది. భారతమ్మ ట్రాక్టర్ బ్రేకులను గట్టిగా పట్టుకుని ఆపకపోతే కొంత మంది కూలీలను ఢీ కొట్టేదని, ఫలితంగా మరింత ప్రమాదం జరిగేదని కూలీలు పేర్కొన్నారు. భారతమ్మ ట్రాక్టర్ ఆపడం వల్ల కూలీలు ప్రమాదం నుంచి బయట పడి ఊపిరి పీల్చుకున్నారు. భారతమ్మ సాహసం చేయక పోతే ట్రాక్టర్ కూలీలపైకి దూసుకెళ్లేదని, ఆమె ధైర్యాన్ని స్థానికులు ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

-కేసు నమోదు.. దర్యాప్తు

ప్రమాద విషయం తెలిసిన వెంటనే రాజగోపాలపేట ఎస్సై వివేక్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా తోకల మల్లయ్య వ్యవసాయ బావి వద్ద ఎత్తుగడ్డకు ట్రాక్టర్ ఆపి, ట్రాక్టర్ జారకుండా టైర్ల కింద రాయని పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు రేపాక మహిపాల్ రెడ్డి కింద పడి చనిపోయాడని ఎస్సై వివేక్ తెలిపారు. ట్రాక్టర్ మహిపాల్ రెడ్డి పొట్టపై నుండి వెళ్లడంతో తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్ళాడని చెప్పారు. వెంటనే అతనిని 108 అంబులెన్స్ ద్వారా సిద్ధిపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా, అక్కడ పరీక్షించిన వైద్యులు మహిపాల్ రెడ్డి అప్పటికే చనిపోయారని ధృవీకరించారని తెలిపారు. మహిపాల్ రెడ్డి భార్య రేపాక కావ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు రాజగోపాల్ పేట ఎస్సై వివేక్ వివరించారు.

-బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండ
నంగునూరు ఎంపీడీవో మహబూబ్ అలీ

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని నంగునూరు ఎంపీడీవో మహబూబ్ అలీ పేర్కొన్నారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పనుల్లో భాగంగా పాలమాకులకు చెందిన రేపాక మహిపాల్ రెడ్డి ప్రమాదవశాత్తు మృతి చెందడం విచారకరమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహమ్మద్ మహబూబ్ అలీ తీవ్ర విచారం వెలిబుచ్చారు. విషయం తెలిసిన వెంటనే పాలమాకులకు వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.పది వేలు అందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం(ఎన్ఎఫ్‌బీఎస్) కింద రూ.20 వేల ఆర్థిక సహాయం, మృతుని భార్యకు వితంతు పింఛన్, రూ.అయిదు లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు.

# రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం





-నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 26 (తెలంగాణ పత్రిక):

పేద మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోనికి తేవడమే లక్ష్యంగా రాజన్న ఫౌండేషన్ పనిచేస్తుందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలో హైస్కూల్ ప్రాంగణంలో ప్రజా సేవకుడు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని హైదరాబాద్ కు చెందిన ప్రముఖ ఆసుపత్రి వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ కంటి సమస్యలతో వచ్చిన సుమారు వందల మందికి అనుభవజ్ఞులైన డాక్టర్లచే కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా రాజన్న ఫౌండేషన్ పనిచేస్తుందని అన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. చికిత్స కోసం వచ్చిన రోగులకు రాజన్న ఫౌండేషన్ వాలంటీర్లు విస్తృత ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మహేష్ రెడ్డి మాసాయిపేట్ మండల సర్పంచి కృష్ణారెడ్డి పి ఎస్ ఎస్ డైరెక్టర నర్సింలు మాజీ ఉపసర్పంచ్ నాగరాజు ఆయా గ్రామాల సర్పంచులు వైద్య సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.



## మాటేడు గ్రామంలో అగ్నిప్రమాదం.. రైతుకు భారీ నష్టం

-బాధిత రైతును పరామర్శించిన మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి



పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక) ప్రతినిధి పున్నం సారయ్య

తొర్రూరు మండలం మాటేడు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మామిడి తోట దగ్ధమై రైతుకు భారీ నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి మంగళవారం బాధిత రైతును పరామర్శించారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఎమ్మార్వో, హార్టికల్చర్ అధికారులు పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయంపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. బాధిత రైతుకు తగిన న్యాయం జరిగేలా చూడాలని మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి అధికారులను కోరారు. వ్యవసాయ అవశేషాలను కాల్చకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని నాయకులు సూచించారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతుకు తగిన పరిహారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల నరేందర్ రెడ్డి, చర్లపాలెం గ్రామ సర్పంచ్ ధర్మారపు మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని రైతుకు సంఘీభావం తెలిపారు.

## చెరువులు, కుంటలను పరిరక్షించాలి: జాటోతు సురేష్ నాయక్

పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక) ప్రతినిధి పున్నం సారయ్య



తోరూర్ మండలంలో ఉన్న రెవెన్యూ గ్రామాలు శివారు తండాల్లో ఉన్న చెరువులు, కుంటలను ఆక్రమణల నుంచి కాపాడుతూ వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సేవాలాల్ సేన మండల నాయకులు జాటోత్ సురేష్ నాయక్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు భూగర్భ జలాల పెరుగుదలకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక చెరువులు ఆక్రమణలకు గురవుతూ తమ అసలు రూపాన్ని కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీటిని నిల్వ చేసే సహజ వనరులను సంరక్షిస్తేనే భవిష్యత్ తరాలకు నీటి కొరత సమస్య తలెత్తదని తెలిపారు. ప్రభుత్వ అధికారులు చెరువుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, చెరువులు, కుంటలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పరిరక్షించాల్సిన అధికారులే అక్రమార్కులతో కుమ్మక్కై పట్టాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి చెరువులు కుంటల విస్తీర్ణం గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## కెనరా బ్యాంకు మేనేజర్ లేక నిలిచిపోయిన లావాదేవీలు

-ఆసరా పింఛన్ డబ్బులను సకాలంలో ఇవ్వడం లేదని నిరసన
-మాసాయిపేట్ సర్పంచ్ కృష్ణారెడ్డి

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 26 (తెలంగాణ పత్రిక):





మాసాయిపేట మండల కేంద్రంలో నేషనల్ హైవే 44 పక్కనే ఉన్న కెనరా బ్యాంకు గతంలో మాసాయిపేట మండల ప్రజానీకానికి ఎన్నో లోన్లు ఇచ్చిన ఘనత ఉన్నప్పటికీ ఇటీవల అనువార్య కారణాల వలన బ్యాంకు మేనేజర్ బదిలీ కావడంతో కెనరా బ్యాంకు ద్వారా జరిగే లావాదేవీలు నిలిచిపోవడంతో మంగళవారం మాసాయిపేట్ సర్పంచి కృష్ణారెడ్డి మరికొంతమంది నాయకులతో కలిసి కెనరా బ్యాంక్ అధికారులను నిలదీశారు. రైతులు ఆర్గాలం పండించిన ధాన్యం విక్రయించి న డబ్బులను సకాలంలో ఇవ్వకపోవడం ఆసరా పింఛన్దారులకు కూడా డబ్బులు ఇవ్వకపోవడంతో విస్కు చెంది కెనరా బ్యాంకు ముందు స్థానిక సర్పంచ్ కృష్ణారెడ్డి మరో కొంతమంది ప్రతినిధులతో కలిసి ఆసరా పింఛన్దారులు రైతులు కెనరా బ్యాంకు ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడారు. అతి త్వరగా కెనరా బ్యాంకు మేనేజర్ ను నియామకం చేపట్టి రైతుల, ఆసరా పింఛన్ దార్ల గోస తీర్చాలని డిమాండ్ చేశారు. లావాదేవీలను పునరుద్ధరణ కోసం కెనరా బ్యాంక్ పై అధికారులు చర్యలు చేపట్టి ఎప్పటిలాగే లావాదేవలెను కొనసాగించాలని కోరారు.

## వివో ఏ ల సమస్యలు పరిష్కరించాలని పలు సమస్యలతో
# కూడిన వినతిపత్రాన్ని తాసిల్దార్ కు అందజేత

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 26 (తెలంగాణ పత్రిక):





వివో ఏల సమస్యలు పరిష్కరించాలని వెల్దుర్తి మండల వివో ఏలు మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనం ముందు సమ్మె నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాసిల్దారు శ్రీనివాస్ కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా వివోఏలు తమ పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ 20 వేలు సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని అన్నారు. అర్హులైన వారికి సి ఎ గా వర్తింపజేయాలని సాధారణ ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని అన్నారు. ట్యాబు సౌకర్యం కల్పించాలని కోరారు. జీవో నెంబర్ 58 నీ సవరించాలని పలు డిమాండ్లతో నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ శ్రీనివాస్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న వివోఏలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను బరాబర్ ప్రశ్నిస్తాం

**–కాంగ్రెస్ నేతల తీరు పై బీఆర్ఎస్ నేతల ఫైర్**

పెద్దపల్లి,ప్రతినిధి మే 25 ( తెలంగాణ పత్రిక )




ప్రతిపక్ష పార్టీగా, ప్రజల తరుపున ప్రభుత్వ వైఫల్యాలను బరాబర్ ప్రశ్నిస్తామని పెద్దపల్లి పట్టణ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతల పై ఫైర్ అయ్యారు. మంగళవారం పెద్దపల్లి జిల్లాకేంద్రంలో ప్రెస్క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో మారు మాట్లాడుతూ... వరి ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో అన్నదాతలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిపక్షపార్టీ హోదాలో మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మాజీ ఎమ్మెల్యే పై ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులకు, ప్రస్తుతం ఓపెనింగ్లు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు అంతా చూస్తున్నారు. గమనిస్తున్నారని, ఇప్పటికైనా తప్పుడు కూతలు బంద్ చేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు ప్రెస్మీట్ పెట్టవద్దు, మాట్లడవద్దు అంటున్నారు. కానీ ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీస్తాం, ప్రశ్నిస్తాం, కొట్లాడుతాం. కాంగ్రెస్ నాయకుడు మస్రత్ నోటికి ఎంత వస్తే అంతా మాట్లాడుతూన్నాడు.. ముందు నీ పార్టీలో నీ స్థాయి ఏంటో తెలుసుకో, మాట్లాడితే పదవులు వస్తాయనే ఆశతో కొందరు ఎమ్మెల్యే దృష్టిలో పడేందుకు మాట్లాడుతున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాళ్లు మొక్కిన వాళ్లు నేడు పదవుల కోసం, తమ ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యే పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. రెండున్నర ఏళ్లల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏం లేదు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పెద్దపల్లిలో గెలిచేది దాసరి మనోహర్రెడ్డియే అనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాశిపాక వాసు, ఎండీ ముఖీం, బొడ్డుపల్లి రమేష్, ఫహీం, పల్లె మధు, ఎండీ రఫీ, కుక్క మనోజ్, ఆదిల్ ఖాన్, ఎండీ అతీక్, ఎండీ ముజాషిర్, అజర్, జూబేరీ, శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# బర్లీ ఫీట్లో అనుమానాస్పద మృతి
## మచిలీపట్నంకు చెందిన వ్యక్తిగా గుర్తింపు

భద్రాద్రి కొత్తగూడెం క్రైం, 26 మే (తెలంగాణ పత్రిక ):



కొత్తగూడెం పట్టణంలోని బర్లీ ఫీట్ ఏరియాలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానిక సమాచారం ప్రకారం తోట రాంబాబు అనే వ్యక్తి రైస్ గ్రాండ్లో క్లీనర్గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పని ముగించుకొని ఝాన్సీ హాస్పిటల్ సమీపంలోని తన నివాస గదికి వెళ్తున్న సమయంలో మెట్ల వద్ద అపస్మారక స్థితిలో పడిపోయినట్లు స్థానికులు గుర్తించారు. అతడిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై సమాచారం అందుకున్న కొత్తగూడెం వన్ టౌన్ పోలీసులు మంగళవారం ఉదయం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ మార్చురీకి తరలించారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు తోట రాంబాబు, వయస్సు సుమారు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండగా, మచిలీపట్నంకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిపారు. చామన చాయ రంగుతో, మెడలో జంధ్యం ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి కుటుంబ సభ్యులు లేదా పూర్తి వివరాలు తెలిసిన వారు వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు.

**–సంప్రదించవలసిన నంబర్లు:**

8712682017 -- IOP

8712682020 -- SI-2

# జనగణన 2027పై కళాజాత





**– ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి , మే 26 (తెలంగాణ పత్రిక):

భారత జనగణన 2027 లో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ప్రధాన జనగణన అధికారి ప్రత్యేక ఆదేశాలతో సమాచార పౌర సంబంధాల సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి సిద్దిపేట జిల్లాకు చెందిన కళాకారులు ప్రజలకు జనగణన 2027 పై చైతన్యం చేయటం జరిగింది, మే 11 న జిల్లాలో జనగణన మొదలయ్యిందని జూన్ 9వరకు ఈ గణన కొనసాగుతుందని ప్రజలందరూ ఇంటికి వచ్చే ఎమ్యూనరేటర్ లకు సహకరించాలని పాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చేర్యాల మున్సిపల్ చైర్పర్సన్ ముత్యాల అరుణ బాల్ నరసయ్య మాట్లాడుతూ ముందుగ ఇండ్ల లెక్కింపు చేస్తారని అనంతరం ప్రజల లెక్కింపు ఉంటుందని, ఇంటి వివరాలు, కుటుంబ వివరాలు, వృత్తి, వ్యాపారం, వంటి అంశాలపై అధికారులకు సహకరించి అడిగే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అందించాలని కోరారు. జనాభా వివరాలు పూర్తిగా తెలిస్తేనే జనాభా అవసరమైన స్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టేందుకు ప్రభుత్వానికి వీలవుతుందని ప్రతి ఒకరు వారి కుటుంబ వివరాలను పూర్తిగా ఎన్యుమరేటర్లకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మరియు సాంస్కృతిక సారథి కళాకారులు కళాంజలి రాజేష్, వెంకటాపురం రవి, దీకొండ భాస్కర్, ముదిగొండ నర్సింలు, పుల్లూరు యాదగిరి, వీరబత్తిని వెంకటేష్, మోతే బాబు, సడిమెల రాజమణి, బండ మంజుల, ఎల్లగారి శేఖర్, ఏర్పుల నర్సయ్య, కొమ్ము రవీందర్, నీరటి రవీందర్, కొమ్ము ఎల్లయ్య , వై.తిరుమలయ్య, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది కలగకుండా రైస్ మిల్ యజమానులు త్వరగా అన్లోడ్ చేయించాలి







**–నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి**

వెల్దుర్తిమండల ప్రతినిధి, మే 26 (తెలంగాణ పత్రిక):

రైతులకు ఇబ్బంది కలగకుండా రైస్ మిల్ యజమానులు త్వరత గతిన కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన లారీలను అన్లోడ్ చేయించుకోవాలని రైస్ మిల్ యజమానులకు నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి సూచించారు. మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలో వెంకట సాయి రైస్ మిల్ కు కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యం పై తాసిల్దార్ జ్ఞాన జ్యోతి ఆర్ఐ దన్ సింగ్ అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న వరి ధాన్యాన్ని త్వరత గతిన రైస్ మిల్ తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి రైతులు పండించిన ప్రతి గింజను కడవరకు కొంటుందని రైతులు అధైర్య పడవద్దని అన్నారు. వర్షాలు వచ్చే సూచనలు ఉన్నందున రైతులందరూ అప్రమత్తుగా ఉండి ధాన్యం తడవకుండా టాపర్లను కప్పి ఉంచాలని సూచించారు. లారీల కొరత లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మహేష్ రెడ్డి మాసాయిపేట్ సర్పంచి కృష్ణారెడ్డి అధికారులు ప్రజా ప్రతినిధులు రైతులు ఉన్నారు.

# రైతన్నలు ఆందోళన చెందవద్దు

**– ధాన్యం మొత్తం కొంటాం...**

**–నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి**

నంగునూరు, మే 26(తెలంగాణ పత్రిక);



రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వచ్చే పది రోజుల్లో పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణను రూపొందించారని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని చెప్పారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్--అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు ఇతర రవాణా వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు తాగునీరుతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజుపల్లి సర్పంచ్ ముక్కెర లింగం యాదవ్, రాగుల కనకయ్య, గౌరబోయిన రాజు, శేఖర్, రాంరెడ్డి, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కాలిపోయిన ఈత తాటివనాన్ని పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల మే 26 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి





జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు కాలిపోయిన ఈత తాటివనాన్ని పరిశీలించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య,మాజీ ఎయంసీ ఛైర్మెన్ కొలుగురి దామోదర్ రావు,టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, సర్పంచ్ వంశీ,మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, జ్యోతి లక్ష్మణ్,కౌన్సిలర్ చాంద్ పాషా, అడువల జ్యోతి లక్ష్మణ్, ఎమ్మార్వో హకీమ్,అర్ ఐ భూమయ్యా, తిరుపతి గౌడ్ మల్లేశం గౌడ్,జయరాం సురేష్,కుడుకల లక్ష్మణ్,గిరి,శరత్ రావు, గౌడ సంఘం సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి మాఫియాతో కుమ్మక్కైన అధికారులనూ వదలం

**-జిల్లాలో మట్టిమాఫియా రాజ్యమేలుతోంది**
**-మాఫియాకు డాన్ గా పెద్దపల్లి ఎమ్మెల్యే..**
**-చెరువులకు గండ్లుపెట్టి మరీ దోపిడి..**
**-బిజెపి జిల్లాధ్యక్షుడు సంజీవరెడ్డి, సురేష్ రెడ్డి..**

పెద్దపల్లి, ప్రతినిధి మే 26 ( తెలంగాణ పత్రిక )

మట్టిమాఫియాతో కుమ్మక్కై రూ.కోట్ల అవినీతికి పాల్పడుతున్న ప్రజాప్రతినిధులతో సహా ప్రభుత్వ అధికారులను ఎవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తేలేదని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాల్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇరువురు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కనుసన్నుల్లోనే మట్టిమాఫియా తమదందాను యధేచ్చగా కొనసాగిస్తోందని తెలిపారు. మట్టి, ఇసుక మాఫియాకు ఎమ్మెల్యే డాన్ గా వ్యవహరిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జిల్లాలో ఎన్ని చెరువులకు పూడికతీత తవ్వకాలు, ఎంత మట్టి తవ్వడానికి, ఎలా తవ్వడానికి అనుమతులిచ్చారో అధికారులెవరి దగ్గరా సరైన సమాచారం లేదని మండిపడ్డారు. మట్టితవ్వకాలను అసలు ఏశాఖ పర్యవేక్షిస్తుందో కూడా తెలియని అయోమయ పరిస్తితిని కలెక్టర్ సృష్టించారని ఆరోపించారు. బిలోకల్ వేబిల్లులతో మోసం.మట్టిని తరలిస్తున్న లారీల వద్ద లోకల్ వేబిల్లులు మాత్రమే ఉన్నాయని, అయినప్పటికి జిల్లా సరిహద్దులు దాటి మట్టి తరలివెళ్ళిపోతున్నదని సంజీవరెడ్డి, సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. మట్టిద్వారా సమకూరే ఆదాయాన్ని గ్రామానికి 25శాతం, మండలానికి 50శాతం మిగతాది జిల్లా పరిషతుకు కేటాయించాల్సి ఉన్నా, నిధులు సంభందిత ఖాతాల్లో జమకాకుండా పక్కదారి పట్టాయని తెలిపారు.



**-చెరువులకు గండ్లుపెట్టిమరీ..**

జిల్లాలో మట్టి మాఫియా రాజ్యమేళుతోందని చెరువులకు, కుంటలకు గండ్లుపెట్టి మరీ మట్టిని అక్రమంగా అమ్ముకుంటూ రైతుల కంట కన్నీటికి కారణమవుతున్నారని ఇరువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిమితికి మించి మట్టిని తరలిస్తున్నా సంభందిత శాఖాధికారులు గానీ, పోలీసు యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరించడం పట్ల అభ్యంతరం తెలిపారు.

**-వాటాలు పంచుకున్న తోడుదొంగలు..**

బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహరరెడ్డి, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయరమణారావు ఇద్దరూ తోడుదొంగలని గతంలో మట్టి, ఇసుక అక్రమాలపై తొడలుకొట్టిన ఇద్దరూ ఇప్పుడు వాటాలు పంచుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. వాటాల్లో తేడాలు రావడంతోనే ఒకరిపై ఒకరు బహిరంగంగా తిట్టుకుంటున్నరని వివరించారు. దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్టు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మట్టిని పంచుకున్నారని ఎద్దేవా చేశారు. అధికారులు సీజ్ చేసిన లారీల వివరాలను ప్రజలకు తెలిపాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు, ప్రజలకు అండగా బిజెపి భారీ ఉద్యమాలకు తెర్లేపుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి కోమల్ల మహేష్, ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్, కార్యదర్శి శివంగారి సతీష్ కుమార్, సుల్తానాబాద్ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, బిజెపి నేత బెజ్జంకి దిలీప్ కుమార్, రామగిరి అఖిల్, బొడ్డుపల్లి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీసుల ఉక్కుపాదం





**-రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏకకాల దాడులు**
**-6 కేసులు నమోదు, భారీగా డాక్యుమెంట్లు స్వాధీనం**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 26, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం 15 ప్రత్యేక బృందాలతో పోలీసులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో అక్రమ ఫైనాన్స్, వడ్డీ దందాలు నిర్వహిస్తున్న వారిపై 06 కేసులు నమోదు చేసి రూ.1,39,65,000 విలువ గల వివిధ డాక్యుమెంట్లు, అలాగే రూ.1,77,000 విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించడం, అధిక వడ్డీలతో సామాన్య ప్రజలను వేధించడం వంటి చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని, ఆ తర్వాత వడ్డీలు చెల్లించలేక కుటుంబాలు ఇబ్బందులు పడే పరిస్థితి రాకూడదని సూచించారు.ప్రభుత్వ అనుమతులతో చట్టబద్ధంగా ఫైనాన్స్ నిర్వహించే వారినే నమ్మాలని ప్రజలకు సూచించారు. అలాగే ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్న వారి వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# వీణవంక లో పలు డిమాండ్ల సాధనకై ఎర్రటి ఎండలో వివోఏ ల నిరవధిక సమ్మె

**-వివోఏ ల మండల అధ్యక్షురాలు నరహరి శ్రీలత..**

వీణవంక ప్రతినిధి, మే 26( తెలంగాణ పత్రిక).

వీణవంక మండల వ్యాప్తంగా 26 గ్రామాలలో మహిళా సంఘాల బలోపేతానికి సేవలందిస్తున్న వివోఏ లు రాష్ట్ర యూనియన్ జేఏసీ సూచన మేరకు, సోమవారం మండల కేంద్రంలోని ఐకెపి ఆఫీస్ ముందు చెవిలో పువ్వు పెట్టుకుని, నినాదాలు చేస్తూ, ఎర్రటి ఎండలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ నిరసన కార్యక్రమంలో వివో ఏ ల అధ్యక్షురాలు నరహరి శ్రీలత మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన మహిళా సంఘాల బలోపేతంతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, మహిళా సంఘాల ఆర్థికంగా బలోపేతానికి వివోఏ ల పాత్ర కీలకమని, మహిళా సంఘాల ఆవిర్భావం చేసిన ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం నుండి ఈనాటి రేవంత్ సర్కారు వరకు మహిళా సంఘాలను ఎప్పటికప్పుడు బలోపేతం చేస్తూ, గ్రామ గ్రామాన పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వివో ఏలు తమ కర్తవ్యంగా పెట్టుకొని నిరంతరం సేవలందిస్తున్నారని, రాష్ట్ర నాయకత్వం సూచన మేరకు పలు డిమాండ్ సాధనకై నిరవధిక సమ్మె జరుగుతుందని, పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందని,పలు డిమాండ్ లో భాగంగా వివోఏ ల



కనీసం వేతనం రూ 20 వేలు ఉండాలని, సీనియార్టీ ఆధారంగా అర్హులైన వారిని సీసీలుగా గుర్తించాలని,సెర్ఫ్ ఉద్యోగాలుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని,ట్యాబ్ సౌకర్యం కల్పించి, 58 జిఓ సవరించాలి. అలాగే సాధారణ మరియు ఆరోగ్య భీమా రూ 20 లక్షల వరకు అవకాశం కల్పించి, వివోఏ ల కు పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.ఈ నిరవధిక సమ్మెలో వివోఏ ల అధ్యక్షురాలు నరహరి శ్రీలత, కార్యదర్శి ఎలుకపల్లి అర్చన, కోశాధికారి గాజుల లావణ్య, వివో ఏలు రాధ, స్వప్న, మల్లీశ్వరి,యమున, సునీత, రజిత, అపర్ణ,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న సదాశివ రెడ్డికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆర్థిక సహాయం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 26, తెలంగాణ పత్రిక

చొప్పదండి నియోజకవర్గం బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికి చెందిన జెడిపల్లి సదాశివ రెడ్డి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం స్థానిక నాయకులు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా, వారు వెంటనే స్పందించారు.సదాశివ రెడ్డి వైద్య చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్ఓసీ ను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ సేవా భావంతో ముందుకు వస్తున్న ఎమ్మెల్యే సత్యం గారిని స్థానిక నాయకులు, గ్రామస్తులు అభినందించారు.



## శంషాబాద్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్ ప్రతినిధి మే 26 తెలంగాణ పత్రిక.

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 22వ తేదీన గోల్కొండ గ్రామ పరిధిలోని శ్రీకృష్ణ ఫార్మసీ కంపెనీ ఎదురుగా ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు కాలువ కింద ఒక గుర్తు తెలియని వ్యక్తికి తలకు గాయమై ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించి చూడగా అతడు మాట్లాడే స్థితిలో కూడా లేదని తీవ్ర గాయాలతో ఉన్నాడని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**-సర్పంచ్ పావని, నరేందర్ గౌడ్**



పాపన్నపేట, మే 26:(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రం పాపన్నపేటలో సీసీ రోడ్డు పనులను మంగళవారం సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ పాలకవర్గం సభ్యులతో కలిసి ప్రారంభించారు. రూ. 10 లక్షల నిధులతో బ్రహ్మణకుంట సమీపన పాతూరు ముత్యాల పోచమ్మ ఆలయం నుండి నాగులమ్మ గుడి వరకు ఈ రోడ్డు రూపుదిద్దుకొనుంది. పాపన్నపేటలో బుధవారం సంత సందర్భంగా ఈ రోడ్డు పై వాహనదారుల రాకపోకలు అధికంగా కొనసాగుతాయి. పంచాయతీ కార్యదర్శి నయీమ్,నాయకులు,వార్డు సభ్యులు.. రాములు, కిష్టయ్య, సత్యగౌడ్, ఖలీమ్, శివయ్య, ప్రసాద్, శ్రీను, చోటు, వినేష్ గౌడ్, శ్రీశైలం, వెంకన్న, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

**-డీడబ్ల్యూవో లక్ష్మీరాజ్యం**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 26



సమాజంపై అవగాహన లేక గ్రామాల్లో బాల్యంలోనే వివాహాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని డి డబ్ల్యూ ఓ లక్ష్మిరాజ్యం డి.ఎస్.పి నాగేంద్ర చారి ఉన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని దత్త సాయి ఫంక్షన్ హాల్లో డి డబ్ల్యు ఓ లక్ష్మీరాజ్యం ఆధ్వర్యంలో మంగళవారం రోజున బాల్య వివాహనపై మహిళలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు, పలువురు అధికారులు వీచ్చేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మాయిలు 18 సంవత్సరాలు వచ్చాక మాత్రమే వివాహం చేసుకోవాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల వారికి పుట్టే పిల్లల్లో జన్యు పరమైన సమస్యలు ఉత్పన్నమౌతాయన్నారు. బాలికలకు యుక్త వయస్సు వచ్చిన వెంటనే వివాహాలు చేసి తల్లిదండ్రులు చేతులు దులుపుకుంటున్నట్లు తెలిపారు అలా చేయడం వల్ల భవిష్యత్‌లో వారు అనేక కుటుంబ సమస్యలతో పాటు ఆరోగ్య, మానసిక సమస్యలను ఎదుర్కొంటారన్నారు బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు పిల్లల దత్తత చాలా సులభం అని, ప్రభుత్వమే ఆ అవకాశం కల్పించినందున ప్రతి ఒక్కరు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం దత్తత తీసుకోవాలని, అవిధంగా చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు ఈకార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కొమిరిశెట్టి విజయ, ఎమ్మార్వో మారుతి రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, మెడికల్ ఆఫీసర్ అభినయ్, షీ టీం ప్రమీల, సిడిపిఓ ఉమారాణి, సూపర్వైజర్ రేణుక, ఏపీఎం సుధా, ఎస్సై అనిల్ కుమార్, 22 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచ్లు వార్డ్ నెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో బీఆర్ఎస్ పనైపోయింది

**-టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**

కామారెడ్డి , మే 26,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పనైపోయిందని, బీజేపీ వచ్చే అవకాశమే లేదని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని క్రిస్టల్ ప్యాలెస్లో మంగళవారం డీసీసీ నూతన కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూతనంగా నియమించబడిన కమిటీ సభ్యులకు, కాంగ్రెస్ మండల అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేసి వారితో ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఏచిన్న పదవి అయినా అది భవిష్యత్తుకు పునాది అని. ఆ పదవికి న్యాయం చేస్తేనే భవిష్యత్తు ఉంటుందని పీసీసీ చీఫ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు. ఉచిత బస్సు నుంచి మొదలుకుని సన్నబియ్యం పంపిణీ వరకు తెలంగాణ పథకాలు ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్తో రాష్ట్రానికి రూ.6 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయన్నారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా కులగణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, యావత్ దేశానికి తెలంగాణ రోల్ మోడల్ అని తెలిపారు. కులగణనలో బీసీలను చేర్చవద్దన్న మోదీకి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. వరి వేస్తే ఉరే అని చెప్పిన విషయాన్ని బీఆర్ఎస్ మర్చిపోయిందన్నారు. కల్లాల మీద రైతులు చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ

తెలంగాణ పత్రిక
GENERAL NEWS

# దుబాయ్‌లో ఉద్యోగ అవకాశాలు

**-జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్**

పెద్దపల్లి, ప్రతినిధి మే 26 ( తెలంగాణ పత్రిక )



తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) ద్వారా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (దుబాయ్) లో వివిధ ఉద్యోగ అవకాశాలు కల్పించ బడుతున్నట్లు పెద్దపల్లి జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రిక్రూట్‌మెంట్‌ను తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్నారు. యు.ఏ.ఇ లో టైల్ మేసన్స్, షట్టరింగ్ కార్పెంటర్, ఆర్‌సిసి వర్కర్, స్టీల్ ఫిక్సర్, స్కాఫోల్డర్, జనరల్ హెల్పర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు అవసరమని పేర్కొన్నారు. టెక్నికల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు AED 1453 (సుమారు 37,800/-) జీతం, ఫుడ్ అలవెన్స్, అటెండెన్స్ బోనస్ కల్పించబడుతుందని, జనరల్ హెల్పర్ పోస్టులకు AED 1200 (సుమారు 31,200/-) జీతం అందించబడుతుందని, అభ్యర్థులకు కనీసం 1 సంవత్సరం అనుభవం ఉండాలి ఫ్రెషర్స్ కూడా జనరల్ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండాలని, కంపెనీ వారే వసతి, రవాణా సదుపాయాలను కల్పిస్తారని, ప్రారంభ ఒప్పంద కాలం (కాంట్రాక్ట్) 2 సంవత్సరాలు ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ నవీకరించిన రెజ్యూమేను tomcom.resume@gmail.com కు పంపాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in ని సందర్శించవచ్చని, 8328602231, 9440050951 , 9440051452 ఫోన్ నంబర్ల నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు



కామారెడ్డి, మే 26, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాలో ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా "బాల్య వివాహం -- బతుకు ఆగం" అనే నినాదంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని మత పెద్దలు, సంఘ పెద్దలు మరియు అన్ని లైన్ శాఖల అధికారులతో సమన్వయంతో బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించబడుతున్నాయి. బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, విద్యాపరమైన దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, బాలికల విద్యాభివృద్ధి మరియు హక్కుల పరిరక్షణపై చర్చలు చేపడుతున్నారు. అలాగే, కామారెడ్డి జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల సహకారంతో ముందడుగు వేస్తూ మొత్తం 42 గ్రామాలను "బాల్య వివాహ రహిత గ్రామాలు"గా ప్రకటించారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, గ్రామస్థులు, మహిళా సంఘాలు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు.

## ఘనంగా ఆత్మ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

**-బోయినిపల్లి మండలానికి చెందిన ఆరుగురికి ఆత్మ కమిటీలో చోటు**

**-శుభాకాంక్షలు తెలిపిన కొమ్మనబోయిన సువీన్ యాదవ్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 26, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన ఆరుగురు నాయకులకు ప్రతిష్టాత్మకమైన ఆత్మ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) కమిటీలో స్థానం దక్కింది. ఈ సందర్భంగా నిర్వహించిన నూతన ఆత్మ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సువీన్ యాదవ్ పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి, సర్పంచులు కనకయ్య, మోహన్, నాయకులు రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సువీన్ యాదవ్ మాట్లాడుతూ.. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆశీస్సులతో పార్టీ కోసం నిరంతరం కష్టపడే నిబద్ధత గల కార్యకర్తలకు ఆత్మ కమిటీలో పదవులు రావడం ఆనందంగా ఉందన్నారు. నూతన సభ్యులు రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా నిలిచి వ్యవసాయ రంగ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. పదవులు పొందిన నాయకులు మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్





సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 26, తెలంగాణ పత్రిక

మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు, వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులకు సూచించారు. జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎన్డీపీఎస్ కేసులు, మాదక ద్రవ్యాల సాగు నివారణ చర్యలు, విద్యార్థులు, యువత డ్రగ్స్ వినియో గించకుండా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వ్యక్తులను గుర్తించి వారికి వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ద్వారా బాధితులకు చికిత్స, మానసిక పరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, విద్యాసంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# రహదారులపై విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎండ తీవ్రత నుండి రక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలి





**-సబ్ డివిజన్ పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన నేర సమీక్ష సమావేశంలో**

**-ఎస్పి రోహిత్ రాజు**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 26

జిల్లా ఎస్పీ కార్యాలయం నందు మంగళవారం నాడు నేర సమీక్ష సమావేశం కొత్తగూడెం సబ్ డివిజన్ అధికారులతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని రహదారులపై, పెట్రోలింగ్, గస్తీ ఇతర విధులను నిర్వహించు అధికారులు సిబ్బంది వేసవికాలంలో ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందడానికి తగిన జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేశారు. విధులు నిర్వహించు సిబ్బంది సమ్మర్ కిట్లను క్యారీ చేయాలని డిహైడ్రేషన్కు గురికాకుండా తరచుగా మంచినీటిని తీసుకుంటూ ఉండాలని ప్రజా సేవతో పాటు ఆరోగ్యం పట్ల కూడా తగిన జాగ్రత్త వహించాలి అని సూచనలు చేశారు. అదేవిధంగా రానున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకునే విధంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భద్రత ఏర్పాట్లును చూడాలని, పశువుల అక్రమ రవాణా జరగకుండా చెక్పోస్టుల వద్ద గస్తీ పెంచాలని సూచనలు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లో నమోదైన పెండింగ్లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకుని సమగ్ర దర్యాప్తు చేసి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, కరుణాకర్, ప్రతాప్, ఇంద్రసేనారెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయాలి

**-త్వరితగతిన కొనుగోళ్ళు పూర్తయ్యేలా చూడాలి**

**-వాహనాలు పెంచాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 26, తెలంగాణ పత్రిక



హమాలీల సంఖ్యను పెంచి, ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సరిపడా సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, సేకరించిన ధాన్యం మిల్లులు, గోదాంలకు తరలించి అన్ లోడింగ్ వేగవంతం చేసి నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మంగళవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లుల్లో అన్ లోడింగ్ పై కలెక్టర్ ఆరా తీశారు. మిల్లుల వారీగా ఎంతవరకు ధాన్యం అన్ లోడింగ్ చేశారో వివరాలు అడిగి, హమాలీల సంఖ్య పెంచుకునేలా యజమానులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. లక్ష్యానికి మేరకు రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం క్రమంగా పెరిగేలా చూడాలని ఆదేశించారు. వర్షాలు పడే అవకాశం ఉన్న దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న బస్తాలను వెంటనే మిల్లులు, గోదాములకు తరలించేలా తక్షణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టార్పాలిన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. గన్నీ బ్యాగులు, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ, తదితర వివరాలు ఆరా తీశారు. కొనుగోళ్ళు పూర్తయిన కేంద్రాల నుండి హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు. రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం పెంచి, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించేందుకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు.


# ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్ క్రియేటర్లకు గొప్ప అవకాశం

**-మే 30లోగా రీల్స్ సమర్పించండి.**

**-ఆకర్షణీయ నగదు బహుమతులు పొందండి.**

**-జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు**

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 26:



99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాల్లో భాగంగా ములుగు జిల్లా పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'లో పాల్గొనాలని ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా హ్యాండ్లర్లకు జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడం రామప్ప దేవాలయం, ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర మేడారం, లక్నవరం ఉయ్యాల వంతెన, తెలంగాణ నయాగరా బొగత జలపాతం, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి అందాలపై 4ఖ నాణ్యతతో రీల్స్ రూపొందించి పంపాలని కోరారు. ములుగు జిల్లా పర్యాటక వైభవాన్ని డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇది సువర్ణావకాశమని తెలిపారు. రూపొందించిన రీల్స్‌ను పెన్‌డ్రైవ్‌లో ములుగు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలి. లేదా జిల్లా పౌర సంబంధాల అధికారి రఫీక్ - 99483 92976, సహాయ పౌర సంబంధాల అధికారి వేణు - 94949 70535 నంబర్లకు వాట్సాప్ ద్వారా 30.05.2026 శనివారం సాయంత్రం 5 గంటల లోపు పంపించాలి. పోటీలలో గెలుపొందినవారికి ప్రథమ బహుమతి 21,000/-, ద్వితీయ బహుమతి 15,000/- , తృతీయ బహుమతి 10,000/- నగదు బహుమతులు అందజేస్తారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవమైన 02.06.2026 రోజున విజేతలను ప్రకటిస్తారు. బహుమతులు రాని రీల్స్‌లో కూడా కంటెంట్, నాణ్యత బాగుంటే వాటిని సంబంధిత క్రియేటర్ పేరుతో జిల్లా అధికారిక ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ పేజీలలో కోలాబరేషన్ పోస్టుల రూపంలో ప్రచురిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రియేటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ములుగు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రకటనలో కోరారు.

# జిల్లా అభివృద్ధిలో ఆర్‌డీఓ వెంకటేష్ సేవలు ప్రశంసనీయం





**-మేడారం మహాజాతర విజయవంతంలో కీలక పాత్ర**
**-సమర్ధవంతమైన సేవలకు ఘన సత్కారం**
**-జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు**

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది మే 26:

ములుగు జిల్లా అభివృద్ధిలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వెంకటేష్ సేవలు ప్రశంసనీయమని, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర విజయవంతం కావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.ములుగు జిల్లాలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వెంకటేష్‌కు మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆర్‌డీఓ వెంకటేష్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌డీఓ వెంకటేష్ జిల్లాలో తన విధుల కాలంలో సమ ర్ధవంతమైన పరిపాలన అందించారని ప్రశంసి ంచారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేశారని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు, రెవెన్యూ పరిపాలన, మేడారం మహాజాతర నిర్వహణ సమయంలో సమన్వయంతో వ్యవహరించి ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని, తన పనితీరుతో సహచర అధికారుల అభిమానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధికి ఆయన అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. కొత్త స్థానంలో కూడా ఇదే నిబద్ధత, అంకితభావంతో పనిచేసి మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు లు మాట్లాడుతూ ఆర్‌డీఓ వెంకటేష్ విధి నిర్వహణలో నియమనిబద్ధత, క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించారని తెలిపారు. రామచంద్రపూర్ భూముల రీసర్వేలో తనకంటూ ప్రత్యేక ముద్రను సంపాదించుకున్నారని, జూనియర్ అధికారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. మేడారం మహాజాతరలో ప్రోటోకాల్ విధుల్లో సమర్ధవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. వివిధ భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడంలో తన వంతు పాత్ర పోషించారని తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఆర్‌డీఓ వెంకటేష్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో పనిచేసిన అనుభవం తనకు ఎంతో ప్రత్యేకమని అన్నారు. జిల్లా అధికారుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం లభించిందని తెలిపారు. అందరి సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. జిల్లాలో పనిచేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. మేడారం మహాజాతరలో విధులు నిర్వహించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన స్థానిక మంత్రి అనసూయ సీతక్కకు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీఓలకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మళ్లీ అవకాశం లభిస్తే ములుగు జిల్లాలో సేవలందించడానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు. అనంతరం ఆర్‌డీఓ వెంకటేష్‌ను జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్‌డీఓ ప్రతాప్, జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జూనియర్ అసిస్టెంట్లు, నాలుగవ తరగతి ఉద్యోగులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాటలే తప్ప హామీల అమలు లేదు





**-వి ఏ ఓల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి**
**-వి ఏ ఓలు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా**

తెలంగాణ పత్రిక దమ్మపేట మే 26

అశ్వారావుపేట(నియోజకవర్గం),దమ్మపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట విఏ ఓ లు వారి సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మెకు లిఅశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ, బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు లి బి ఆర్ ఎస్ పార్టీ తరుపున మద్దతు తెలిపారు.వారికి మజ్జిగ ప్యాకెట్లు మరియు నిమ్మ సోడాను అందజేశారు. వారి ఆవేదనను సమస్యలను విన్నారు. వారికి అండగా పార్టీ నిలబడుతుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ప్రభుత్వంలో మానవీయ కోణంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 3000 నుంచి 5000 లకు పెంచారని గుర్తుచేశారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని గాలికి వదిలేశారాని మండిపడ్డారు.ఈ రెండేండ్లలో విపరీతమైన పని చేయించుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం వారిని చిన్న చూపు చూడడం సరికాదని.వెంటన వి ఏ ఓల డిమాండ్లను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున వారితో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ రమేష్,దారా యుగంధర్,పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల,ఉప సర్పంచ్ రామకృష్ణ,అబ్దుల్ జిన్నా, యార్లగడ్డ శ్రీనివాస్ రావు,మండవ సత్య నారాయణ, చీకటి రామయ్య, బుడే,దేవరపల్లి అజయ్ కుమార్,దారా రాము, గోళ్ళ భవనీ కృష్ణ యాదవ్, రావుల శ్రీను,జలగం వాసు, వెలుగోటి మహేష్, కాసిని శ్రీను,కుకలకుంట రవి,మండల బీసీ నాయకులు తాళ్ల వెంకటేశ్వరావు, ధర్మ, సతీష్, నాగేశ్వరరావు, కోర్సా వెంకటేష్, శంకర్,కనపర్తి కార్తీక్ తదితరులు ఉన్నారు.

# జూన్ 2 న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి






**-జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

కామారెడ్డి ,మే 26, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్ లో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూజూన్ 2 న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. పతాకావిష్కరణ, తెలంగాణతల్లి చిత్రపటానికి పూలమాలలు సమర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రజాప్రతినిధుల సందేశాలు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమర వీరులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించేల కార్యక్రమాలను రూపొందిం చాలన్నారు. స్టేజీ, మైక్ , సౌండ్, త్రాగునీరు, విద్యుత్, పార్కింగ్ లను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా ఎదుగుతోందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులను కోరారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఘనంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ విక్టర్ , ఏ సి ఎల్ బి, ఎన్ వి .గిరి తదితరులు పాల్గొన్నారు.

# జీవితంలో ఉన్నత లక్ష్యాల ను నిర్దేశించుకోవాలని విద్యార్థులకు సూచన

**-విద్యార్థులను అభినందించిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి కల్వ సుజాత గుప్త**

కామారెడ్డి, మే 26, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో లక్ష్మీదేవి గార్డెన్స్ లో జిల్లా వ్యాప్తంగా పదవ తరగతిలో 550 కి పైగా మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థుల కోసం నిర్వహించిన ఉత్తమ వైశ్య విద్యార్థుల అభినందన సభ కార్యక్రమానికి విచ్చేసిన ఆత్మీయ అతిథి ఉప్పల శ్రీనివాస్ గుప్త,తెలంగాణ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి కల్వ సుజాత గుప్త,జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డిఐజి డాక్టర్ దుద్దెల శ్రీనివాస్ గుప్త లు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆ లక్ష్యాలను సాధించుకోవడం కోసం నిరంతరం కృషి చేయాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడం జరుగుతుందని విద్యార్థులకు సూచించారు,ప్రస్తుత పోటీ పరిస్థితుల్లో ప్రతి మార్కు కూడా విలువైన దానిని అన్నారు.బట్టి పద్ధతిలో కాకుండా ప్రతి విషయాన్ని అవగాహన చేసుకుంటేనే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని అన్నారు. మార్కులతో పాటుగా ఆధ్యాత్మిక భావన,సామాజిక సేవలో భాగస్వాములు అయినప్పుడే అని జీవితం సంతోషదాయకంగా ఉంటుందనే విషయాన్ని తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలియజెప్పాలని అన్నారు. ఐవిఎఫ్ ఆధ్వర్యంలో మొట్ట మొదటిసారిగా జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 56 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్,ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు,రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరి మారుతి,యువజన విభాగం రాష్ట్ర నాయకులు నరేశ్,నవీన్,జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్,ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్, కోశాధికారి కస్వ వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు బుక్క రజని,ప్రధాన కార్యదర్శి చిలువేరి మారుతి, కోశాధికారి గజవాడ రవి అన్నపూర్ణ,ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షులు ఎల్లంకి సుదర్శన్, ఎర్రం విజయ్ కుమార్,యువజన విభాగం అధ్యక్షులు ఎర్రం ఈశ్వర్ సలహాదారులు శనిశెట్టి శ్రీనివాస్,మందుల రామచంద్రం లు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు రూ.307 కూలీ చెల్లించాలి

**-ఫోటో విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలి --**
**సీపీఎం డిమాండ్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 26, తెలంగాణ పత్రిక






రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు తమకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ. 307 కూలీ పూర్తిగా బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే ప్రస్తుతం అమలులో ఉన్న ఫోటో విధానం కారణంగా సమయం వృథా అవుతోందని, కూలీలకు అనవసర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఫోటో విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చకుండా యథాతథంగా కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మండల సీపీఎం పార్టీ కన్వీనర్ గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలు చేసిన పనికి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన రూ. 307 కూలీ పూర్తిగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి 15 రోజులకు ఒకసారి కూలీల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

## బేతిగల్ లో అమ్మ లేక అనాధలైన అన్నాచెలెళు ఆర్థికంగా సహాయం చేసి జీవితాలను నిలపండి

**-దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని ఎదురుచూపులు..**

వీణవంక ప్రతినిధి, మే 26( తెలంగాణ పత్రిక).



వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన గొట్టే అజయ్ తల్లి ప్రాణాల కోసము వారి దగ్గర ఉన్నదంతా ఖర్చు చేసిన శతకోటి దేవతలను మొక్కిన అజయ్ తల్లి రజిత తిరిగిరాని లోకాలకి వెళ్ళిపోయారు.చివరికి అందరూ ఉన్న అమ్మ లేని నిరుపేద కొడుకుగా మిగిలిపోయాడు.ఆ కుటుంబం లో నోరులేని ( మాటలు కూడా రాని నాన్న)అనారోగ్యం తో బాధపడే 12 సం॥రాల ముద్దుల చెల్లె కూలి, నాలీ పని చేసుకునే 17 సం॥రాల అజయ్ మాత్రమే మిగిలారు.తినడానికి తిండి ఉండటానికి సరిగా ఇల్లు కూడా లేని అత్యంత దయనీయ నిరుపేద కుటుంబానికి మీరు చేసే చిన్న సహాయం ఆ కుటుంబానికి కొండంత అండ అవుతుంది. మీకు చేతనైనా సహాయం 10 20 50 100 అందించి మానసికంగా,ఆర్థికంగా బలహీనమై దుఃఖంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని రెండు చేతులు జోడించి అన్న చెల్లెలు వేడుకుంటున్నారు. దయచేసి ఈ ఫోన్ పే 7287817004, 8008104753 నంబర్లకు తోచిన సహాయం చేసి, మమ్ములను ఆదుకోవాలని అన్నాచెల్లెలు విలపిస్తున్నారు.

## రజకుల ఆత్మగౌరవంపై ఎమ్మెల్యే పేరుతో దాడి

-స్వార్థ కులరాజకీయ ప్రయత్నాలు మానుకోవాలి..
-మన రజకసంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రమేష్..

పెద్దపల్లి, ప్రతినిధి మే 26 ( తెలంగాణ పత్రిక )





పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రజకుల భూమి వద్ద ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును కీర్తిస్తూ విజ్ఞన్ననగర్ బోర్డును ఏర్పాటు చేయడం యావత్ రజక సమాజాన్ని అవమానించడమేనని మన రజకసంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి రమేష్ అన్నారు. తెలంగాణ పోరాట యోధురాలు, వీర వనిత చిట్యాల ఐలమ్మ పేరు పెట్టాల్సింది పోయి, రాజకీయ నాయకుల పేర్లతో బోర్డులు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రజకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, కొందరు చోటమోటా నేతలు తమ స్వలాభాల కోసం రజక కులాన్ని మంటగలిపే విధంగా దృశ్చర్యాలకు పాల్పడుతున్నారని రమేష్ మండిపడ్డారు.ఎమ్మెల్యే మెప్పుకోసం కాంగ్రెస్ ముసుగులో ఉన్న రజకసంఘం నాయకుడు, తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం రజక జాతిని వాడుకోవడం సిగ్గుచేటని బొడ్డుపల్లి రమేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే భజన చేయాలనుకుంటే ఇతర మార్గాలను ఎన్నుకోవచ్చునని, కానీ రజకజాతి పేరును వాడుకునే హక్కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రజకులకు 100ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, దోబీ ఘాట్ నిర్మిస్తామని గొప్పలు చెప్పిన ఎమ్మెల్యే, అధికారంలోకి వచ్చాక రజకులను పట్టించుకున్న దాఖలాలు లేవని రమేష్ ఆరోపించారు. ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, ఇప్పుడు రజకుల భూమిపై బోర్డులు వేస్తూ రాజకీయ డ్రామాలు చేయడం మానుకోవాలని ఆగ్రహించారు.పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహరరెడ్డి రజక సంఘం నిర్వహించే బోనాల జాతరలకు వెండి కిరీటాలు, ఆభరణాలు సమర్పించడం ద్వారా ఆయన సంఘం పట్ల తన భక్తిని, గౌరవాన్ని చాటుకున్నాని, పేద రజకులకు పుస్తె-మట్టెలు అందించడం, బియ్యం, రవాణా సౌకర్యాలు కల్పించడం వంటి సేవా కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మపై గౌరవంతో, ఆమె విగ్రహ ఏర్పాటు చేశారని, నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కూడా ఆయన సుముఖంగా ఉన్నట్లు రమేష్ వివరించారు.రజక సమాజాన్ని తక్కువ అంచనా వేసి, కబళించాలని చూస్తే ఊరుకునేది లేదని, ఎమ్మెల్యే పేరుతో ఉన్న అనధికారిక బోర్డులను వెంటనే తొలగించి, వీర వనిత చిట్యాల ఐలమ్మ పేరుతో నామకరణం చేయాలని రమేష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, రజక సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## నిర్జల ఏకాదశీ అంటేఏమి టి?దాని ప్రాధాన్యం

-లెక్చరర్ ఉమాశేషారావు వైద్య

కామారెడ్డి ,మే 26 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





సంవత్సరంలోని అన్ని ఏకాదశీలలోఅత్యం తమహిమాన్వితమైనదిగా భావించబడుతుంది. దీనినిభీమఏకాదశీ,పాండవ ఏకాదశీ అని కూడా అంటారు. జ్యేష్ఠ శుక్ల ఏకాదశి నాడు ఈ వ్రతం ఆచరించబడుతుంది. నిర్జ ల ఏకాదశీ అంటేఏమిటి? "నిర్" అంటే లేకుండా,"జ ల" అంటే నీరు.అంటే ఈ రోజున ఆహారమే కాదు, నీళ్లు కూడా తీసుకోకుం డా ఉపవాసం చేయడం ఈ వ్రతం యొక్క ప్రధాన విశేషం. భక్తితో ఈ వ్రతాన్ని ఆచరించిన వారికిసంవ త్సరంలోని 24 ఏకాద శుల ఫలితంల భిస్తుందని పురాణాలుచెబుతాయి. భీమసేనుని కథ, భీమ సేనుడు అన్నపాన ప్రియు డు. ఇతనికిప్తరచుగాఉప వాసం 9 సాధ్యం కాకపో యింది. అప్పుడు వ్యాస మహర్షి ను అడిగి "నేను అన్ని ఏకాదశులుచేయలే ను; ఒకటి చేసినా సమస్త ఫలం వచ్చే మార్గంచెప్పం డి" అని ప్రార్థించాడు. అప్పుడు వ్యాసుడు ఇలా చెప్పాడని పురాణ గాథ జ్యేష్ఠ శుక్ల ఏకాదశినాడు నీళ్లు కూడా తాగకుండా ఉపవాసం చేస్తే అన్ని ఏకాదశుల ఫలంలభిస్తుం దని ఉపదేశించాడు. అందుకే దీనికి "భీమ ఏకాదశీ" అనే వచ్చింది. ఆచరణ విధానందశ మి నుంచే సాత్విక ఆహారం తీసుకోవాలి. ఏకాదశి రోజు ఉదయం స్నానం చేసి శ్రీ మహా విష్ణువు ను పూజించాలి.విష్ణు సహస్ర నామం, గీతా పారాయ ణం, ఓం నమో నారాయ ణాయ" జపం చేయాలి. సాధ్యమైనంత వరకు నీరు కూడాతీసుకోకుండా ఉపవాసం ఉండాలి. రాత్రి జాగరణ చేయడం శ్రేష్ఠం.ద్వాదశి రోజు ఉద యం పారణ చేసి ఉప వాస విరమణ చేయాలి. దానం ముఖ్యంగా జలదా నం, గొడుగు, వస్త్రం, పాద రక్షలుఇవ్వడంశు భప్రదం. ఆధ్యాత్మిక భావంనిర్జ ల ఏకాదశి కేవలం ఆకలి ఆపడం కాదు.ఇది ఇంద్రి యనియమనంమనోనిగ్రహంభగవద్ స్మరణభ క్తి, శరణాగతి వాటిని పెం పొందించే వ్రతం. ఆరోగ్య పరంగా జాగ్రత్తఈ వ్రతం కఠినమై నదికాబట్టివృద్ధు లుగర్భిణీఅనారోగ్యంతో ఉన్నవారుపూర్తి నిర్జల ఉపవాసం చేయకుండా, ఫలాహారం లేదా తులసీ తీర్థంతో ఉపవాసం చేయ వచ్చు. భక్తి ప్రధానము. ఏకాగ్రతతో నిర్జల ఏకాదశి ఆచరించినవాడు పాప విముక్తుడై విష్ణులోక ప్రాప్తిని పొందుతాడని భావాన.

## రాత్రి సమయంలో కూడా మొక్కజొన్న అన్‌లోడింగ్ కొనసాగేలా చర్యలు చేపట్టాలి







-ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి.
-జిల్లా కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 26

లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారు చిలక మొక్కజొన్న నిల్వ గోడౌన్‌తో పాటు ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు.బంగారు చిలక మొక్కజొన్న గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్, గోడౌన్‌కు చేరుతున్న మొక్కజొన్న లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోడౌన్‌లో 2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సుజాతనగర్, కొత్తగూడెం, టేకులపల్లి, ఇల్లందు, చర్ల, సమ్మెట, బూర్గంపాడు, ఆళ్లపల్లి, గుండాల తదితర మండలాల నుంచి మొక్కజొన్న ఇక్కడికి వస్తోందని తెలిపారు.అన్‌లోడింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా రాత్రివేళల్లో కూడా పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం తగిన లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు హమాలీలను నియమించాలని సూచించారు. గోడౌన్‌లో మొక్కజొన్న నిల్వల అన్‌లోడింగ్ తీరును, బస్తాలను భద్రపరుస్తున్న విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, పూర్తి నిల్వ సామర్థ్యాన్ని వినియోగించుకునేలా పంటను నిల్వ చేయాలని, ఎలాంటి నష్టం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిల్వ సామర్థ్యాన్ని మరింత సమర్థవంతంగా వినియోగి ంచుకునేలా మొక్కజొన్న బస్తాలను సాధ్యమైనంత ఎక్కువ ఎత్తులో పేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హమాలీలతో మాట్లాడిన కలెక్టర్, ఒక్క లారీ అన్‌లోడింగ్‌కు ఎంత సమయం పడుతోంది, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. హమాలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, పూర్తి స్థితిపై సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం మే నెలలో ప్రారంభమైన పనులు ఇప్పటివరకు పూర్తికాక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, పనుల ఆలస్యానికి గల కారణాలను వివరంగా నివేదించాలని ఆదేశించారు. పనుల అమలులో జాప్యం చోటుచేసుకున్న కాంట్రాక్టర్లకు మెమోలు జారీ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల వ్యయంతో మహిళా సాధికారతకు వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ ప్లాన్లు, గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించిన కలెక్టర్, పనులు ఎప్పటిలోగా పూర్తి అవుతాయో అధికారులను ఆరాతీశారు. పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సంఖ్యలో కార్మికులను నియమించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవనంలోని ప్రతి బ్లాక్‌ను అన్ని సౌకర్యాలతో సిద్ధం చేయాలని, స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పరిశీలనలో తాసిల్దార్ శిరీష, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చవద్దు పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారం కాపాడాలి





-నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
-జిల్లా వ్యవసాయ శాఖ అధికారి. శ్రీనివాస్

పెద్దపల్లి,ప్రతినిధి మే 26 ( తెలంగాణ పత్రిక )

పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలుగుతుందని, పంట అవశేషాలను కాల్చవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో వరి పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు గమనించబడుతున్నాయని తెలిపారు. పంట అవశేషాలను కాల్చినపుడు కార్బన్ మోనాక్సైడ్ (CO), కార్బన్ డయాక్సైడ్ (CO2), నైట్రోజన్ డయాక్సైడ్, (NO2), సల్ఫర్ డయాక్సైడ్ (SO2) వంటి హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు.అలాగే, పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని , దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుందని చెప్పారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో రైతులు పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని సూచించారు. జిల్లాలో పంట అవశేషాల దహనాన్ని నిరోధిం చేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపడుతున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి స్పష్టం చేశారు.రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, శాశ్వత వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల్లో టెక్నాలజీ నైపుణ్యాల పెంపుకు ఏఐ & రోబోటిక్స్ శిక్షణ దోహదం





-గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్య అందించడం లక్ష్యం
-ఏ ఐ రోబోటిక్స్ రంగాల్లో విద్యార్థులు రాణించేలా ప్రత్యేక శిక్షణ
-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ప్రతినిధి మే 26 ( తెలంగాణ పత్రిక )

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ ), రోబోటిక్స్ మరియు డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధికి నిర్వహించిన "సూపర్ సమ్మర్ కంప్యూటర్, ఏ ఐ & రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్" ఎంతో దోహదపడిందని జిల్లా కలెక్టర్ కోయశ్రీ హర్ష అన్నారు.టి-ఫైబర్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఏప్రిల్ 27 నుండి మే 26 వరకు నెల రోజులపాటు మంథని, పెద్దపల్లి, రామగుండం మరియు సుల్తానాబాద్ కేంద్రాలలో నిర్వహించగా, మొత్తం 312 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి కేంద్రంలో ఆరు రోజుల పాటు కంప్యూటర్,ఏఐ , రోబోటిక్స్ మరియు డిజిటల్ స్కిల్స్ పై ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.కార్యక్రమం ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన "పెద్దపల్లి జిల్లా ఏ ఐ &రోబోటిక్స్ స్టూడెంట్ షోకేస్ -- 2026" లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని నాలుగు ప్రాంతాల నుండి ఎంపికైన విద్యార్థులు తమ ప్రాజెక్టులు, రోబోటిక్స్ నమూనాలు, ఏ ఐ ఆధారిత వినూత్న ఆలోచనలు మరియు డిజిటల్ స్కిల్స్ ప్రజెంటేషన్లు ప్రదర్శించి ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తు సాంకేతికత ఆధారిత ప్రపంచంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఆధునిక సాంకేతిక విద్యలో ముందుండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యం మరియు సాంకేతిక అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించి భవిష్యత్తులో ఏఐ , రోబోటిక్స్, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో రాణించాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సర్టిఫికెట్లు మరియు మెమెంటోలు అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమం లో జిల్లా పరిపాలన అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఆహ్వానిత అతిథులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఇందిరా పార్క్ వద్ద లైసెన్స్డ్ సర్వేయర్ల 'మహాధర్నా






-భూభారతి' కింద స్పష్టమైన పని విధానం ప్రకటించాలి
-తహసీల్దార్ కార్యాలయాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్
-రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన సర్వేయర్లు. దద్దరిల్లిన ధర్నాచౌక్

చందూరు, తెలంగాణ పత్రిక మే 26

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లైసెన్స్ సర్వేయర్లు గళమెత్తారు. తెలంగాణ లైసెన్స్ సర్వేయర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన 'చలో హైదరాబాద్' మహాధర్నా ఉధృతంగా సాగింది. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన సర్వేయర్ల నినాదాలతో ధర్నాచౌక్ పరిసరాలు దద్దరిల్లాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు మాట్లాడుతూ.. కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన 'భూభారతి' చట్టం కింద లైసెన్స్ సర్వేయర్లకు స్పష్టమైన వర్క్ అలోట్మెంట్ పాలసీ (పనుల కేటాయింపు విధానం)ని ప్రభుత్వం వెంటనే రూపొందించాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో తమకు సముచిత స్థానం కల్పించాలని, విధి నిర్వహణకు అవసరమైన వసతులు కల్పించాలని కోరారు. ఉద్యోగ విధుల కేటాయింపుతో పాటు జీతాలు, భత్యాల విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి, సానుకూల నిర్ణయం తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేశారు.

-ఒకే వేదికపైకి సర్వేయర్లు..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్వేయర్లందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడంలో ఈ నిరసన సభ పూర్తిగా విజయవంతమైందని అసోసియేషన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సర్వేయర్ల ఆవేదనను, ఆకాంక్షలను ప్రభుత్వ దృష్టికి బలంగా తీసుకెళ్లామని, దీనిపై సర్కారు నుంచి త్వరలోనే అధికారిక స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షుడు మంద గోవర్ధన్, ఉపాధ్యక్షులు మొగుదాల రాంప్రసాద్, భూతరాజు మురళి, సర్వేయర్లు భూతరాజు మహేష్, మధుసూదన్ రెడ్డి, పెద్దలు, చందర్ నాయక్, ప్రశాంత్, సంపత్ తో పాటు వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ పెద్దలు, హక్కుల నాయకులు, సర్వేయర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశానికే తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్ గా నిలుస్తోంది

-పిసిసి అధ్యక్షులుమహేష్ కుమార్ గౌడ్

కామారెడ్డి , మే 26,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




కులగణనలో బీసీలను చేర్చవద్దన్న మోదీకి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని, దేశంలోనే మొట్టమొదటిసారిగా కులగణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, యావత్ దేశానికే తెలంగాణ రోల్ మోడల్గా నిలిచిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని క్రిస్టల్ ప్యాలెస్లో నిర్వహించిన డీసీసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "వరి వేస్తే ఉరే" అని చెప్పిన విషయాన్ని బీఆర్ఎస్ మర్చిపోయిందన్నారు. కల్లాల పై రైతులు చనిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొంటామని అంటోందని, అయినప్పటికీ 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణరాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, బీజేపీకి వచ్చే అవకాశమే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏ చిన్న పదవి అయినా భవిష్యత్తుకు పునాది వంటిదని, ఆ పదవికి న్యాయం చేస్తేనే రాజకీయ భవిష్యత్తు ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం నుంచి సన్న బియ్యం పంపిణీ వరకు తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాల్లో లేవన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు సంక్షేమ పథకాలలో దేశానికి తెలంగాణ ప్రభుత్వం రోల్ మోడల్ గా నిలుస్తోంది అని అన్నారు.

# గంభీరావుపేటలో పలు డిమాండ్ల సాధనకై ఐకెపి వివోఏ ల నిరవధిక సమ్మె

-యూనియన్ మండల అధ్యక్షురాలు వాసం మమత ఆధ్వర్యంలో

గంభీరావుపేట తెలంగాణ పత్రిక మే 26



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలోనీ మహిళా సంఘాల బలోపేతానికి సేవలందిస్తున్న ఐకెపి వివోఏ లు రాష్ట్ర యూనియన్ జేఏసీ సూచన మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయం ముందు నినాదాలు చేస్తూ, ఎర్రటి ఎండలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు వాసం మమత మాట్లాడుతూ గ్రామ గ్రామాన మహిళా సంఘాల బలోపేతంతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, మహిళా సంఘాల ఆర్థికంగా బలోపేతానికి వివోఏ ల పాత్ర కీలకమని, మహిళా సంఘాల ఆవిర్భావం చేసిన ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం నుండి ఈనాటి రేవంత్ సర్కారు వరకు మహిళా సంఘాలను ఎప్పటికప్పుడు బలోపేతం చేస్తూ, గ్రామ గ్రామాన పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వివో ఏలు తమ కర్తవ్యంగా పెట్టుకొని నిరంతరం సేవలందిస్తున్నారని, రాష్ట్ర నాయకత్వం సూచన మేరకు పలు డిమాండ్ సాధనకై నిరవధిక సమ్మె జరుగుతుందని, పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందని,పలు డిమాండ్ లో భాగంగా వివోఏ ల కనీసం వేతనం రూ 20 వేలు ఉండాలని, సీనియార్టీ ఆధారంగా అర్హులైన వారిని సీసీలుగా గుర్తించాలని, సెర్ఫ్ ఉద్యోగాలుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని,ట్యాబ్ సౌకర్యం కల్పించి, 58 జిఓ సవరించాలి. అలాగే సాధారణ ఆరోగ్య భీమా రూ 20 లక్షల వరకు అవకాశం కల్పించి, వివోఏ ల కు పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ నిరవధిక సమ్మెలో ఐకెపి వివోఏ యూనియన్ అధ్యక్షురాలు వాసం మమత కార్యదర్శి కీర్తి కోశాధికారి భారతి తో పాటు సభ్యురాలు పాల్గొన్నారు

# బిజెపి పార్టీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నేనావత్
# హనుమంతు నాయక్ ను ఘనంగా సన్మానించిన బేరి రామచందర్ యాదవ్

-తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి మే 26.



రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి గోపనపల్లి తండాకు చెందిన నేనావత్ హనుమంతు నాయక్ బిజెపి పార్టీ రాష్ట్ర ఎస్టీ మోర్చా బంజారా సమితి ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా వారికి ఘనంగా సన్మానించిన బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్. ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ హనుమంతు నాయక్ ఎస్సీలకు సామాజికంగా రాజకీయంగా విద్యా ఉద్యోగ రంగాలలోబ అవకాశాలు కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం నుండి సబ్సిడీల ద్వారా విద్యాపరంగా సహకరించే విధంగా చర్యలు తీసుకోవాలని, పార్టీకి పనిచేస్తూ మునుముందు ఉన్నత పదవులు రావాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించడం జరిగింది. అలాగే నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, కే నరసింహ యాదవ్, యువజన విభాగం నాయకులు డీజే భవన్, అసోసియేషన్ కాలనీ పెద్దలు మహిళా సంఘాలు యువజన నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నేనావత్ హనుమంతు నాయక్ మాట్లాడుతూ ఎస్టీల సమస్యలపై నిరంతరం పోరాడుతానని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని గిరిజనులకు అందించేలా చర్యలు చేపడతానని తెలిపారు. ఎస్టి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికచేసిన బిజెపి నాయకులకు ప్రత్యేక అభినందనలు ధన్యవాదాలు తెలియజేశారు.

## వడ్లూరులోరైలు కింద పడి 19 గొర్రెలు మృతి



కామారెడ్డి , మే 26,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ 1వ వార్డులో రైలు కింద పడి 19 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కుర్మ ఆరెల్లి లక్ష్మి తన గొర్రెల మందను మంగళవారం ఉదయం మేతకు తీసుకువెళ్తుండగా గ్రామంలోని కల్లు దుకాణం సమీపంలోకి వెళ్లగానే రైలు పెద్ద శబ్దంతో హారన్ కొట్టింది. దీంతో భయాందోళనకు గురైన గొర్రెలు పరిగెత్తి హడావిడిగా వెళ్లి రైలు కింద పడ్డాయి. దీంతో 19 గొర్రెలు చెల్లా చెదురుగా పడిపోయి మృతి చెందాయి. ఈ ఘటనలో బాధిత రైతుకు సుమారు లక్షన్నర వరకు ఆస్తి నష్టం సంభవించింది. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ

-కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో




కోటగిరి తెలంగాణ పత్రిక మే 26.

కోటగిరి మండలంలోని దేవునిగుట్ట తండా గ్రామంలో మండల బిజెపి అధ్యక్షులు వేముల నవీన్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఏముల నవీన్ మాట్లాడుతూ. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెరగడానికి క్రీడలు దోహదపడతాయని ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ బృందం, నిజామాబాద్ జిల్లా సేవలల్ సేన అధ్యక్షులు సీతారాం నాయక్, బిజెపి మండల అధ్యక్షులు ఏముల నవీన్, పత్తి సతీష్ కప్ప సాయిలు హరి కృష్ణ దేవుని గుట్ట యువకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో డ్రగ్స్,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు

-ఎల్లారెడ్డిపేట మండలంలో కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ ప్రాంతాలలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు నిర్వహణ

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 26, తెలంగాణ పత్రిక



ఎల్లారెడ్డిపేట మండలంలోని కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఈరోజు పోలీసు అధికారులు నార్కోటిక్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## ఎల్లారెడ్డి ఎమ్మెల్యే నేడు గాంధారి మండలం లో పర్యటన

కామారెడ్డి, మే 26, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్ మోహన్ రావు బుధవారం గాంధారి మండలంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. గాంధారి మండలం కేంద్రంలో మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారని అనంతరం మోకారం చెరువు కట్ట సుందరీ కరణ పనుల స్థల పరిశీలన చేస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ నాయకులు అధికారులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

# ప్రియుడిపై ప్రియురాలి సోదరుల దాడి

**-మనస్తాపంతో ప్రియుడు ఆత్మహత్య**

కామారెడ్డి, మే 26,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రియుడిపై ప్రియురాలి సోదరులు దాడి చేయడంతో మనస్తాపం చెందిన ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన ధ్రువ కుమార్(19) అదే కాలనీకి చెందిన ఓ అమ్మాయిని మూడేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఈ విషయం అమ్మాయి సోదరులకు తెలియడంతో వారు ధ్రువ కుమార్ పై దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ధ్రువ కుమార్ సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


# నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది బదిలీల ప్రక్రియ : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి,మే 26, తెలంగాణ పత్రిక

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న సిబ్బంది బదిలీల ప్రక్రియను నిబంధనలు అనుగుణంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఈ బదిలీల ప్రక్రియలో ముందుగా ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వివరాలను సంబంధిత జిల్లా అధికారులు కలెక్టర్ కు అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న స్థానం నుండి ఇతర స్థానాలకు పారదర్శకంగా సిబ్బందిని బదిలీ చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ా

# గోడిశెల రాజేశం గౌడ్ ను పరామర్శించిన మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ తొలి జడ్పీ చైర్‌పర్సన్



జగిత్యాల మే 26 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి

మాజీ మంత్రి గోడిశెల రాజేశం గౌడ్ మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ ఉమక్క తుల ఉమక్క అలాగే వరంగల్ వాస్తవ్యులు దీ=వా పార్టీ రాష్ట్ర నాయకురాలు, ఆరోగ్య సంరక్షణ నిపుణురాలు తెలంగాణ రాష్ట్ర సహాయక పునరుత్పత్తి సాంకేతికత మరియు సరోగసీ బోర్డులో మహిళా సంక్షేమ సంస్థల ప్రతినిధిగా సేవలందిస్తున్న డాక్టర్ హరి రామ దేవి, ఆత్మీయంగా కలిసి పరామర్శించారు గోడిశెల రాజేశం గౌడ్ ని ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేశం గౌడ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ తమ శుభాకాంక్షలు తెలిపారు.

# జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

మే 26 కరీంనగర్ తెలంగాణ పత్రిక




కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మంగళవారం జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న సీపీకి ఇన్స్పెక్టర్ రామకృష్ణ పూలమొక్కను అందించి స్వాగతం పలికారు.అనంతరం సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై సిబ్బందికి కీలక ఆదేశాలు మరియు సూచనలు ఇచ్చారు. తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టిన సిసిటీఎన్ఎస్ -2.0, టి.ఎస్ - సీఒపి, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ టూల్స్, బాడీ వార్న్ కెమెరాల వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి పట్టు సాధించి, రోజువారీ విధుల్లో వాటిని విరివిగా ఉపయోగించాలని ఆదేశించారు. స్టేషన్‌లోని రికార్డులను, ఎఫ్.ఐ.ఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.జమ్మికుంట పరిధిలోని గ్రామాలను సెక్టార్లు, సబ్-సెక్టార్లుగా విభజించి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ పై పలు సూచనలు చేశారు సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.పోలీస్ సిబ్బంది విధుల్లో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని.. రిసెప్షన్, పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట్, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటం కష్టం: లొంగిపోయిన మావోయిస్టు నరహరి

**-లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు చెక్కులు అందజేసిన డీజీపీ**

మే 26 హైదరాబాద్ తెలంగాణ పత్రిక

ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టులు చేపట్టిన సాయుధ పోరాటం కష్టంగా మారిందని ఆ పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు పసునూరి నరహరి వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మావోయిస్టులు నరహరితో పాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సమక్షంలో మీడియా ఎదుట ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా లొంగిపోయిన నరహరి మీడియాతో మాట్లాడుతూ జార్ఖండ్, తెలంగాణతో పాటు మిగతా ప్రాంతాల్లో సాయుధ పోరాటం పరంగా అనేక నష్టాలు చేశామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కల్పించిన అవకాశాలు కారణంగానే తాము ప్రజా జీవితంలోకి వచ్చామని స్పష్టం చేశారు. జార్ఖండ్‌లోని మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిరి బిశ్రా అనుమతితోనే తాము ప్రజా జీవితంలోకి వచ్చామని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కుల సాధన చట్టపరంగానేజరగాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. లొంగి పోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలు, సాయుధ పోరాటంలో చోటు చేసుకున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రజా జీవితంలోకి రావాలని మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావును నరహరి కోరారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు డీజీపీ సీవీ ఆనంద్‌కు పసునూరి నరహరి కృతజ్ఞతలు తెలిపారు.మే 12వ తేదీన తెలంగాణ పోలీసులు ఎదుట మావోయిస్టులు నరహరితో పాటు ధనమ్మ లొంగిపోయారు. వీరిని మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా వారికి ప్రభుత్వం తరపున వారికి డీజీపీ నగదు చెక్కులను అందజేశారు. అజ్ఞాతంలో ఉన్న 47 మంది మావోయిస్టులు కూడా లొంగిపోవాలని ఈ సందర్భంగా డీజీపీ పిలుపునిచ్చారు.

లొంగిపోయిన మావోయిస్టు దంపతులు..చెక్కులు అందజేసిన డీజీపీ





మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్ లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితో పాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు.లొంగిపోయిన వారిద్దరికి రూ.25 లక్షలు,రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు.అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 47 మంది మావో యిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15,జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు.మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్షణరావు అలియాస్ గణపతితో పాటు జాడే రత్నబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు.మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తో పాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి,ఆయన భార్య లొంగిపోయారు.వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది.ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు.మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు.ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయిందన్నారు.

# పథకం ప్రకారం హత్య.. 12 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు

మే 26,సూర్యాపేట తెలంగాణ పత్రిక





జిల్లా రూరల్ పరిధిలోని సోలిపేట గ్రామంలో జరిగిన మేకల జయరాములు హత్య కేసును పోలీసులు కేవలం 12 గంటల్లోనే ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు.మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు జయరాములు తనకు వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల భూమిని గతంలో తన తమ్ముడు కృష్ణయ్యకు కౌలుకు ఇచ్చాడని, అనంతరం తిరిగి స్వయంగా సాగు చేసుకోవడం ప్రారంభించడంతో కుటుంబ సభ్యుల మధ్య భూమి, గెట్టు, ఇంటి హద్దుల విషయంలో తరచూ వివాదాలు నెలకొన్నాయని తెలిపారు.ఈ క్రమంలో నిందితులు మేకల కిరణ్, అతని భార్య మౌనిక, కిరణ్ తల్లిదండ్రులు కృష్ణయ్య, లక్ష్మమ్మ, మరో వ్యక్తి రామచంద్రు కలిసి జయరాములను హత్య చేయాలని ముందుగానే పథకం రచించినట్లు ఎస్పీ వెల్లడించారు.సోమవారం సాయంత్రం జయరాములు పొలం వద్దకు వచ్చిన సమయంలో గ్రామ ఆర్చ్ సమీపంలో అడ్డగించి గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు తెలిపారు.హత్య అనంతరం నిందితులు గ్రామం విడిచి పారిపోయారని, కేసు నమోదు చేసిన వెంటనే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సూర్యాపేట హైటెక్ బస్ స్టాండ్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన గొడ్డలి, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులకు గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదన్నారు.భూమి, ఆస్తి తగాదాలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని, ఓర్పు కోల్పోయి హత్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు భూమి వివాదాల కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్షలు కూడా పడుతున్నాయ ని గుర్తుచేశారు. కేసును వేగంగా ఛేదించిన డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్సై బాలు నాయక్ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# గోదావరి పుష్కరాల నిర్వహణకు సమాయత్తం





**-దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**

మే 26 మంచిర్యాల జిల్లా తెలంగాణ పత్రిక

2027 గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సమాయత్తం అవుతుందని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు.మంగళవారం సరస్వతి పుష్కరాల 6వ రోజు సందర్భంగా కాళేశ్వరం విచ్చేసిన మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, జగిత్యాల, పెద్దపల్లి కలెక్టర్లతో కలిసి మెగా విశ్రాంతి భవనంలో సమావేశం నిర్వహించారు.సరస్వతి ఆది, అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు కల్పించిన సౌకర్యాలను, మ్యూజియంను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం సుమారు 1 వేయి కోట్ల రూపాయల నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని, సరస్వతి పుష్కరాల సందర్భంగా ఎదురైన లోటుపాట్లను గుర్తించి, గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతాల జిల్లాల కలెక్టర్లతో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, త్రాగునీరు, మరుగు దొడ్లు, పార్కింగ్, విద్యుత్ సరఫరా, వీఐపీ, వివిఐపిలు పర్యటనలకు ఏర్పాట్లు, ఇతర అంశాలపై జిల్లాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గోదావరి నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయం దర్శించుకుని హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సమావేశంలో నిజామాబాద్, నిర్మల్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143